చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ ఏకాడమి, హైదరాబాద్ వారి ప్రచురణ రూ.4/-

# బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక

అక్టోబర్ 1990



ప్రారంభ సంచిక

ఏషియాడ్ - 90

కంప్యూటర్




MFRS:
AMBICA CHEMICAL PRODUCTS
ELURU W.G.Dt.

# బాల చెలిమి

**పిల్లల వికాస పత్రిక**

సంపుటి : 1 సంచిక : 2 — చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ ఎకాడమి ప్రచురణ — అక్టోబర్ - 1990




**లోపలి పేజీల్లో ...........**


## కథలు :


| | |
|---|---|
| ఉడుత-తోడేలు | 4 |
| సాధన | 6 |
| సంతృప్తి | 15 |
| మంత్రి నక్క (అనగా అనగా) | 17 |
| అమ్మమ్మ ఐడియా (కార్టూన్ కథ) | 21 |
| కుడి ఎడమైతే | 31 |
| అభినందన | 35 |
| కొంటె కోతి (బొమ్మల కథ) | 40 |




## శాస్త్రీయ వ్యాసాలు :


| | |
|---|---|
| నాట్యం చేసే సబ్బుబుడగలు | 9 |
| కంప్యూటర్ కబుర్లు | 19 |
| అభ్యాసం కూసువిద్య | 29 |
| జీవనదాత సూర్యుడు | 32 |

## ఫీచర్స్ :


| | |
|---|---|
| ఏషియాడ్ - 90 | 5 |
| జిల్లాలతో చెలిమి (అదిలాబాద్) | 10 |
| చెలిమి సమాచారం, పిల్లల పత్రిక | 24 |
| హార్న్‌బిల్ (పక్షి పరిచయం) | 37 |
| విద్యాశాఖ డైరెక్టర్ శ్రీ టి. వెంకారెడ్డి అభిప్రాయాలు | 41 |
| నేనూ - నా బాల్యం | 47 |





## ఇతర విషయాలు :


■ కవితలు ■ పొన్ను పరిచయం ■ అక్టోబర్ కథ ■ చదివినన్ని రోజులు స్కాలర్‌షిప్‌లు ■ ధీమాను పెంచే దీపావళి ■ కలం చెలిమి ■ నవోదయ పాఠశాలల్లో ప్రవేశం ■ ఫోటోక్విజ్ ■ పుస్తక పరిచయం ■ ఇంకా ఎన్నో కబుర్లు.



సలహాదారులు : శ్రీ బుద్ధిగ సుబ్బరాయన్, శ్రీ దేవిప్రియ, ప్రొఫెసర్ జి. హరగోపాల్, శ్రీ బి. నరసింగరావు, డాక్టర్ వెలగా వెంకటప్పయ్య, శ్రీ చంద్ర, శ్రీమతి తురగా జానకీరాణి, డాక్టర్ మహీధర నళినీ మోహన్, శ్రీ అనిల్ ఎగ్నోటె, శ్రీ ప్రవీణ్ కపాడియా. సంపాదకులు : వేదకుమార్; రూపకల్పన: షరీఫ్; సహ సంపాదకులు : దుర్గం రవీందర్, టి.వి. జగన్‌మోహన్ ఉపసంపాదకులు: చల్లా శ్రీనివాన్, ఆర్టిస్ట్స్ : టి. గంగాధర్, టి.వి. రామకృష్ణ, సిరాజ్. మార్కెటింగ్ మేనేజర్ : జి. కరుణాకర్‌రావు, బిజినెస్ మేనేజర్ : జి.ఎ. రతన్‌కుమార్.

**బాలచెలిమి,** పిల్లల వికాస పత్రిక, 10, హిమాయత్ నగర్, హైదరాబాదు - 29. ముఖచిత్రం : బేబి షామిలి.




# Cut a little...stick a little... and look what you've made with Fevicol

Use your imagination and Fevicol MR Adhesive. Put your beautiful ideas together. Create something that is a joy to behold.

With Fevicol, odds and ends like cloth, wood, beads and even seeds come together to become wonderful eye-catching dolls, lampshades, purses and wall-hangings...without creating a mess.

And the magic of Fevicol MR holds them together for a long, long time. Because Fevicol MR Adhesive is the bond that lasts.

Now! You can join the Fevicol Art/Handicraft classes in all the major cities in India. For details write to: Sales Promotion Dept., Pidilite Industries Ltd., Box No. 11084, Bombay 400 020





**FEVICOL** MR
Synthetic Adhesive

**When you do your best, you stick with the best**

® Both and FEVICOL brand are the Registered Trade Marks of PIDILITE INDUSTRIES LTD., Bombay 400 021

OBM/4296




'బాలచెలిమి' పరిచయ సంచికను ఆవిష్కరిస్తున్న కేంద్ర సమాచార ప్రసారశాఖ మంత్రి శ్రీ పి. ఉపేంద్ర తేది: 6-1-90'





## సంపాదకీయం

**చెలిమి అంటే స్నేహం ...**
**"బడిలో చెలిమి**
**ఇంట్లో చెలిమి బాలచెలిమి".**

చదువుకోడానికి పాఠ్యపుస్తకాలు మినహా ఇతర బాలసాహిత్యం అందుబాటులో లేని విద్యార్థుల్లో లోకజ్ఞానం పెంచి, రోజు రోజుకు విస్తరిస్తున్న ప్రపంచ జ్ఞానాన్ని మారుమూల ప్రాంతాలలోని విద్యార్థులకు కూడా ఎప్పటికప్పుడు అందించి వారిని ఎవరికి తీసిపోని విధంగా తయారుచేస్తుంది 'బాలచెలిమి'. పిల్లల పెంపకంలో అటు తల్లిదండ్రులకు ఇటు ఉపాధ్యాయులకు 'బాలచెలిమి' చక్కని ఉపకరణంగా ఉండాలన్నది మా ఆశయం. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ ఎకాడమీ నాలుగేళ్ళ ప్రయత్న ఫలితం అయిన ఈ పత్రికను బాల పాఠకలోకం ఆదరించి చేయూతనిస్తుందని ఆశిస్తున్నాము.

వేదకుమార్
సంపాదకుడు



# ఉడుత తోడేలు

అడవిలో ఒక ఉడుత ఉండేది. అది రోజూ అడవిలో దొరికే పండ్లు, లేత చిగుళ్ళు తిని ఆనందంగా ఒక చెట్టుమీది నుండి ఇంకో చెట్టుమీదికి దుముకుతూ ఉండేది.

ఒకరోజు ఉడుత ఒక చెట్టుమీదనుండి ఇంకో చెట్టుమీదికి దుముకుతుంటే పట్టుతప్పి ఆ చెట్టు కింద నిద్రిస్తున్న తోడేలుపై పడింది. తోడేలుకు నిద్ర చెడింది.

వెంటనే అది కోపంగా ఉడుతను పట్టుకుని "నా నిద్ర చెడగొడతావా! నిన్నిప్పుడు ఏం చేస్తానో చూడు. నమలకుండా గుటుక్కున మింగేస్తాను" అంది.

"దయచేసి నన్ను ఒదిలిపెట్టు" అని బతిమాలింది ఉడుత.

"సరే నిన్ను ఒదిలిపెడతాను. కాని నేనడిగే ప్రశ్నకు జవాబు చెప్పు" అంది తోడేలు.

'సరే' అన్నది ఉడుత.

'మీరు ఇంత ఆనందంగా ఎలా ఉండగలుగుతున్నారు. ఆడుతూ, గంతులేస్తూ ఏ చీకూ చింతా లేకుండా ఉంటున్నారు. మేము ఎప్పుడూ ఏదో అశాంతితో చికాకుగా ఉంటాము. ఎందుకో చెప్పు' అంది.

దానికి ఉడుత -


'నిన్ను చూస్తుంటే భయమేస్తోంది. నన్ను ఒదిలిపెట్టు. చెట్టుపైకి వెళ్ళి చెబుతా' అంది.

'సరే'నని తోడేలు ఉడుతను ఒదిలి పెట్టింది.

ఉడుత వెంటనే చెట్టు కొమ్మపైకి వెళ్ళి 'మా మనసులో ఎలాంటి చెడ్డ ఆలోచనలుండవు. ఎవరికీ హాని చేయాలనే తలంపే రాదు. మనసులో ఎలాంటి చెడు ఆలోచనలు లేకుంటే సంతోషంగా ఉండొచ్చు. మీ మనసులో ఎప్పుడూ ఏవో చెడ్డ ఆలోచనలుంటాయి. అవి మీ మనస్సుకు శాంతి లేకుండా చేస్తాయి. అందుకే మీరు ఎప్పుడూ అలా అశాంతితో ఉంటారు' అంది.

అది విని తోడేలు నిజం తెలుసుకొని సిగ్గుపడ్డది.

(లియో టాల్‌స్టాయ్ కథ ఆధారంగా)





# ఏషియాడ్ '90



ఆసియా ఖండంలోని అన్ని దేశాల ఆటగాళ్ళు పాల్గొనే ఆసియా క్రీడలు నాలుగేళ్ళకు ఒకసారి జరుగుతాయి. ఇవి ప్రతిసారి ఆసియాలోని ఏదో ఒక దేశంలో జరుగుతాయి. జాతి, మత భేదాలు వదిలి మనుష్యులందరూ ఒక్కటే అనే భావాన్ని ఈ క్రీడలు కలిగిస్తాయి. ఈ ఉద్దేశ్యంతోనే ఆసియా క్రీడలు ప్రారంభమయ్యాయి. ఆసియా క్రీడలు జరగడానికి ముఖ్యకారకుడు మనదేశానికి చెందిన శ్రీ గురుదత్ సోంధి. సోంధి వివిధ దేశాల అధిపతులను కలిసి ఏషియాడ్ ఉద్దేశాల్ని వివరించి చెప్పాడు. అప్పటి మన ప్రధాని శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ కూడా ఉత్సాహం చూపడంతో తొలి ఆసియా క్రీడలు భారతదేశంలోనే 1951లో ఢిల్లీలో జరిగాయి. అలా ఆనాటి నుండి పది ఆసియా క్రీడోత్సవాలు జరిగాయి. ఇప్పుడు పదకొండవ ఆసియా క్రీడోత్సవాలు చైనా రాజధాని అయిన బీజింగ్‌లో జరుగుతున్నాయి. ఈ క్రీడల్లో దాదాపు 38 దేశాలకు చెందిన ఆరువేల మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. దాదాపు 27 రకాల ఆటల్లో స్త్రీ, పురుషులకు వేరువేరుగా ఆటల పోటీలు నిర్వహిస్తారు. ఇంతవరకు జరిగిన ఏషియాడ్ లోకంటె ఇది పెద్దది.

11వ ఆసియా క్రీడల్లో తొలిసారిగా కబడ్డీ, కత్తిసామును ప్రవేశపెట్టారు.

ఈ క్రీడలు ఏ దేశంలో జరుగుతాయో ఆ దేశములో ఉండే ఒక జంతువు బొమ్మను అధికారిక చిహ్నంగా గుర్తిస్తారు. దీనిని 'మస్కట్' అంటారు. మన దేశంలో ఆసియా క్రీడల మస్కట్ 'అప్పు'. అలాగే ఇప్పుడు చైనాలో తరచుగా కనిపించే 'పాండ' అనే జంతువు బొమ్మను మస్కట్‌గా నిర్ణయించారు.

భారతదేశం తరఫున ఏషియాడ్‌లో ఆడటానికి 290 మంది క్రీడాకారులు బీజింగ్ వెళ్ళారు. వారు అత్యధిక సంఖ్యలో పతకాలను సాధిస్తారని ఆశిద్దాం!

## ఏషియాడ్ పతాకము

ఆసియా క్రీడల పతాకం తెల్లగా ఉండి మధ్యలో ప్రకాశిస్తున్న సూర్యుడి బొమ్మ ఉంటుంది. ఏషియాడ్‌లోని సభ్య దేశాల సంఖ్యలో నీలిరంగు చక్రాలు ఉంటాయి. దానిపై 'ఎవర్ ఆన్‌వార్డ్' అనే నినాదం ఇంగ్లీష్‌లో ఉంటుంది. ఎప్పుడూ ముందుకే వెళ్ళు, ఆలోచించు అని దీని అర్థం.



# సాధన



జ్యోతికి చాలా కోపంగా ఉంది!

బుంగమూతి పెట్టి కుర్చీలో కూర్చుంది. తన పక్కన కూర్చుని తన వైపే తోక ఆడిస్తూ కూర్చున్న కుక్కపిల్లను అకారణంగా ఒక్కటి కొట్టింది. అది కుయ్‌మంటూ బయటికి పరిగెత్తింది. తన ఎదురుగా టేబుల్‌పై ఉన్న రిబ్బన్లను, బూట్లను చూస్తుంది కోపంగా.

జ్యోతికి ఆరేళ్ళు వయసు ఉంటుంది. స్కూలుకు వెళ్తుంది. బుద్ధిగా చదువుకుంటుంది. ఈరోజు మాత్రం తనపై తనకే చాలా కోపంగా ఉంది. ఎవరితోనూ మాట్లాడటం లేదు.

'నిన్నటి నుండి రిబ్బన్‌తో కుచ్చులు వేయడం నేర్చుకోవాలని ప్రయత్నిస్తుంది కాని రావటం లేదు. తనకు రిబ్బనుతో ముడి వేయవచ్చును. కాని కుచ్చు వేయటమే రావటం లేదు''. ఇదే జ్యోతి కోపానికి కారణం.

ప్రొద్దుటి నుండి మాట్లాడక కుర్చీలో కూర్చున్న జ్యోతిని చూసి వాళ్ళ నాన్న

'మళ్ళీ ఒకసారి ప్రయత్నించమ్మ' అన్నాడు.

'సాధన చెయ్యి అదే వస్తుంది' అంది అమ్మ.

'ఇది చాలా సులువు' అన్నాడు వాళ్ళ అన్నయ్య.

జ్యోతికి వాళ్ళందరు ఎగతాళి చేస్తున్నట్లు అనిపించింది. మళ్ళీ టేబుల్‌పైన ఉన్న రిబ్బను తీసికొని కుచ్చులు వేయటం ప్రారంభించింది. ఉహు! రావట్లేదు. కాసేపటికి అలసిపోయింది. కుచ్చులు వేయటం మాత్రం రాలేదు. సాయంత్రం వాళ్ళ నాన్న బయటి నుండి వచ్చి

'కొద్దిగా టైమ్ తీసికొని నిదానంగా వెయ్యి' అన్నాడు.

'మళ్ళీ ప్రారంభించు' అంది వాళ్ళ అమ్మ.

'కుచ్చులు వేయడం చాలా సులువు' అన్నాడు నవ్వుతూ వాళ్ళ అన్నయ్య. తను అలాగే ప్రయత్నిస్తే కుచ్చు వేయగలుగుతాననుకుంది జ్యోతి. మరుసటి రోజు స్కూల్లో తన బూట్లకున్న దారాలు విప్పి సాధన చేసింది. అయినా రాలేదు. చాలా కోపం వచ్చింది. ముందున్న బెంచిని అసహనంగా ఒక్క తన్ను తన్నింది.

సాయంత్రం ఇంటికి రాగానే మళ్ళీ ప్రారంభించింది.

"నీవు అలసిపోయినట్టున్నావ్" అంది వాళ్ళ అమ్మ.

'రేపు మళ్ళీ ప్రయత్నించు' అన్నాడు వాళ్ళ నాన్న.

'ఇది చాలా సులువు' అన్నాడు వాళ్ళ అన్నయ్య.

జ్యోతికి వాళ్ళ మాటలు పట్టుదలను పెంచాయి. కోపంగా రిబ్బన్లు తీసికొని మంచం పైకి వెళ్ళింది.

ఆ రాత్రి చాలాసేపటి వరకు కుచ్చులు వేసేందుకు ప్రయత్నించింది.

ప్రొద్దున్నే జ్యోతి వాళ్ళ అమ్మ, నాన్న, అన్నయ్యలు లేచి చూసి ఆశ్చర్యపోయారు. గదంతా కుచ్చులు వేసి ఉన్నాయి. కుర్చీలకు, టేబుల్‌కు, వాళ్ళ నాన్న, అన్నయ్యల బూట్లకు, కుక్క పిల్ల మెడకు అన్నింటికి కుచ్చులు వేసి ఉన్నాయి. జ్యోతి అలిసి పోయినట్లుగా మంచం పైన పడుకుని ఉంది.


"నాకు తెలుసు జ్యోతికి తప్పకుండా కుచ్చులు వేయడం వస్తుందని" అన్నాడు వాళ్ళ నాన్న.

"సాధన చేస్తే ఏ పనైనా సులువుగా చేయవచ్చు. మన జ్యోతి చాలా కష్టపడింది అంది వాళ్ళ అమ్మ.

అప్పుడే లేచిన జ్యోతి –

'ఇది చాలా సులువు' అంది వాళ్ళ అన్నయ్య వైపు నవ్వుతూ ఆనందంగా చూస్తూ.

డా॥ కృష్ణకుమారి





పరీక్ష హాలునుండి బయటికి వచ్చిన హెడ్‌మాస్టర్, అనిల్, సునీల్ పోట్లాడుకోవటం చూసి.

హెడ్‌మాస్టర్ : మీరిద్దరు ఎందుకు పోట్లాడుకుంటున్నారు.

అనిల్ : సార్ ఇతను నా పేపరు చూసి కాపీ కొట్టాడు.

హెడ్‌మాస్టర్ : ఏది కాపీ గొట్టాడు.

అనిల్ : నేను తెల్ల పేపరిస్తే వీడుకూడా అలాగే ఇచ్చాడు.

---

గోపి : నాన్నా గోల్కొండ ఎక్కడుంది?

నాన్న : హైదరాబాద్‌లో.

గోపి : అలాగా! అది బొంబాయిలో ఉంటే ఎంత బావున్ను.

నాన్న : ఎందుకురా?

గోపి : మరి నేను బొంబాయిలో ఉందని రాశాగా!

---

మాష్టారు : తాజ్‌మహల్ ఎక్కడుందిరా?

సంతోష్ : తెలియదండి.

మాష్టారు : అయితే బెంచీ ఎక్కు.

సంతోష్ : బెంచీ ఎక్కితే కనిపిస్తుందాండీ.

----

సతీష్ ఏడుస్తూ.

నాన్నా నా బుడగను రాము పైకి వదిలేశాడు.

నాన్న : ఏరా రాము ఎందుకు వదిలేశావ్.

రాము : నిన్న మా టీచర్ చెప్పింది. భూమికి ఆకర్షణ శక్తి ఉందని. నాకేం తెలుసు భూమి బుడగలను ఆకర్షించదని.

-----

# పొన్ను



ఇతని పేరు పొన్ను!

పిల్లలందరితో చెలిమి చేయడానికి వస్తున్నాడు. తెలుగుదనాన్ని నింపుకున్న పల్లెటూర్లో ఓ మోస్తారు చదువు, సంస్కారం ఉన్న మధ్యతరగతి కుటుంబంలో పుట్టాడు. చదువు కోసం పట్నం వచ్చాడు. బంధువులతో విదేశాలకు వెళ్ళాడు.

పొన్ను చురుకైనవాడు చదువుల్లో, ఆటల్లో ఫస్ట్. కంప్యూటర్లతో ఆడుకుంటాడు. సరియైన పద్ధతిలో ఆలోచిస్తాడు. ప్రతి విషయాన్ని విశ్లేషణా దృష్టితో పరిశీలిస్తాడు. మూఢనమ్మకాలు వద్దంటాడు. ఏక సంథాగ్రాహి. మాటల్లో, చేతల్లో, ఆలోచనల్లో ఎంతో లాజిక్కు, రీజనింగ్ ఉంటాయి. ఇన్ని ఎందుకూ.....! పొన్ను పిల్ల వాళ్ళలో పిల్లవాడు పెద్దవాళ్ళలో పెద్దవాడు. బుద్ధిమంతుల్లో బుద్ధిమంతుడు. తుంటరుల్లో తుంటరి.


ఆ! పొన్నుకు ప్రాక్టికల్ జోక్స్ అంటే ఇష్టం. అన్నట్టు మరిచాం! పొన్ను పచ్చటి చెట్లు పరిశుభ్రమైన వాతావరణం ఉండాలంటాడు. చెట్లు, పక్షులు, జంతువులతో చెలిమిచేస్తాడు. చల్లనివెన్నెల, పంటపొలాలు, నిండుగా పారుతున్న కాలువలు, చెరువులంటే పొన్నుకు ప్రాణం.

ఇకనుండి పొన్ను నెలనెలా 'చెలిమి' ద్వారా రకరకాల కబుర్లు తెలియచేస్తాడు. మరి పొన్నుతో మీరందరూ చెలిమి చేస్తారు కదూ!

# నాట్యం చేసే సబ్బు బుడగలు

సబ్బు బుడగలను తయారుచేసే పద్ధతి అందరికీ తెలిసినదే. చిక్కని సబ్బు ద్రవంలో బొబ్బాసి గొట్టం ముంచి, గొట్టపు రెండో కొన నోట్లో పెట్టుకొని నెమ్మదిగా ఊదితే సబ్బు బుడగలు తయారవుతాయి. ఈ బుడగల చేత నాట్యం చేయించే కిటుకు ఒకటి ఉంది. అదిప్పుడు మీకు చెపుతాను.

లోతైన విశాలమైన గాజుగిన్నెలో నాలుగైదు చెమ్చాల కార్బన్ టెట్రా క్లోరైడ్ ద్రవం పోసి, ఆ గిన్నెను వేడి నీళ్ళు పోసిన పళ్లెంలో ఉంచాలి. అయిదు, పది నిముషాలు పోయాక ఆ గాజు గిన్నెలోకి మూడు నాలుగు సబ్బు బుడగలు నింపాదిగా విడిచి ఏమౌతుందో చూడండి. ఆ సబ్బు బుడగలు పైకీ, కిందికీ తమాషాగా నాట్యం చేస్తాయి. సబ్బు బుడగలు తేలిక అయినప్పటికీ గాలికన్నా బరువైనవి కావడం చేత నిశ్చలమైన గాలిలో నెమ్మదిగా కిందికి దిగుతాయి. కాని, కార్బన్ టెట్రాక్లోరైడ్ ఆవిరి గాలికన్నా సుమారు ఐదు రెట్లు బరువైనది కావడం చేత గాలితో నిండిన సబ్బు బుడగలు ఈ ఆవిరిలో పైకి తేలుతాయి. హైడ్రోజన్ నింపిన రబ్బరు బుడగలు గాలిలో పైకి తేలినట్లే. అయితే గాజు గిన్నెలో మట్టు దగ్గర ఈ ఆవిరి ఎక్కువ దట్టంగానూ, పైకి వెళ్ళినకొద్దీ పలుచ గానూ ఉండటం చేత సబ్బు బుడగలు కిందికి దిగుతూ మట్టు దగ్గరకి రాగానే కనిపించని చిత్రమైన 'కుషన్' ఏదో ఉన్నట్లు పైకి గెంటబడతాయి. బుడగలు పైకి వెళ్ళిన కొద్దీ వాటి బరువును నిలబెట్ట గలిగినంత దట్టమైన ఆవిరి లేకపోవడం చేత అవి మళ్ళీ కిందికి దిగుతాయి.



గాజుగిన్నెలోని కార్బన్ టెట్రా క్లోరైడ్ పూర్తిగా ఆవిరి అయిపోయేదాక సబ్బు బుడగలు ఈ విధంగా నృత్య వినోదంతో చూస్తున్న వారికి కాలక్షేపం కలిగిస్తాయి. వచ్చేనెల ఇంకో సైన్సు సరదా చెప్తాను.

డాక్టర్ మహీధర నళినీ మోహన్

# ఆదిలాబాద్




పచ్చని అడవులు, అడవిలో పెద్ద పెద్ద చెట్లు, చెట్ల మధ్య పులులు, జింకలు, దుప్పులు, నెమళ్ళు .. ఇంకా దట్టమైన అడవి మధ్య నుండి పొడుచుకు వచ్చే కొండలు, ఆ కొండలపై నుండి ఉరకలు వేస్తూ దుమికే కొండవాగులు, జలపాతాలు ... ఆ అడవిని చుట్టి ఉండే పెద్ద నదులు. ఆ నదుల ఒడ్డున ఆలయాలు, ఆదిమానవుడు నివసించిన రాతిగుహలు, శిలాజాలు, రాక్షస బల్లి అవశేషాలు... ఇవన్నీ ఎక్కడున్నాయో తెలుసా? ... అదిలాబాదు జిల్లాలోనే...!

అదిలాబాదు రాష్ట్రానికి పై భాగాన హైదరాబాదుకు దాదాపు 310 కి.మీ. దూరంలో ఉంది. బస్సులో వెళితే సుమారు 10 గంటల ప్రయాణం. మొదట ఇది శాతవాహనుల రాజ్యంలో ఉండేది. తర్వాత చాళుక్యులు, విజయనగర రాజులు, కాకతీయులు పాలించారు. తర్వాత గోండు రాజ్యంలో భాగమైంది. తర్వాత ఆదిల్‌షా, పిమ్మట నిజాం ఇలా ఎందరో రాజులు ఈ జిల్లా భూభాగాన్నిపాలించారు.

జిల్లా ముఖ్యపట్టణం అదిలాబాదు. ఇది రాష్ట్రంలో ఐదవ పెద్ద జిల్లా. జిల్లా విస్తీర్ణంలో నలభై శాతం అడవులే. ఈ అడవుల్లో విలువైన టేకు, నల్లమద్ది వెదురు లభ్యమవుతాయి. ఈ అడవుల్లో పులులు, జింకలు, దుప్పులు, నెమళ్ళు, అడవి ఎద్దులు ఎన్నో ఉన్నాయి. జిల్లా పొడవునా సింహాద్రి కొండలు, వాటిపై నుండి దూకే జలపాతాలు, కొండవాగులు, ఎంత అందంగా ఉంటాయి. జిల్లాకు సరిహద్దురేఖలుగా ఉన్న గోదావరి, పెన్‌గంగా, వార్ధా, ప్రాణహిత నదులు ఎంతో నీటిని జిల్లాకు సమకూరుస్తున్నాయి జిల్లాలో రోడ్లు అంతగా అభివృద్ధి చెందలేదు. ఏడవ నంబరు జాతీయ రహదారి జిల్లా గుండా పోతుంది.

అదిలాబాదు జిల్లా పేరు వినగానే అడవులు, గోండులు గుర్తుకు వస్తారు. జిల్లాలో చాలా రకాల గిరిజనులున్నారు. వీరిలో చాలామంది గోండులు. వీరు కాకుండా మధుర, కొలామి, కోయ, లంబాడి మొదలైన తెగలవారు కూడా ఉన్నారు. వీరు దేవుడిని పూజిస్తారు, పాపం చెయ్యడానికి భయ పడతారు. వీరు వ్యవసాయం చేస్తారు. అడవిలో దొరికే తేనె, పండ్లు, కలప, సారపలుకులు మొదలయిన వాటిని సేకరించి అమ్మ





## మీ ఊరి విశేషాలు మీకు ఎన్ని తెలుసు?

మా ఊరు విశేషాలు మాకు తెలియకపోవడం ఏమిటని అనుకుంటున్నారా? అయితే చెప్పండి..., ఒకటి.. రెండు...మూడు... ఇలా కొన్ని చెప్పేసరికి ఏమీ లేవనిపిస్తుంది. అందుకని మీకు నెలనెలా ఒక్కొక్క జిల్లా విశేషాలు తెలియజేస్తాం. ముందుగా అదిలాబాద్ జిల్లా విశేషాలు తెలుసుకుందాం.



జీవిస్తుంటారు. వీరిలో 'ఒజాలు' అనే వారుంటారు. వీరు ఇత్తడిని పోతపోసి చక్కటి బొమ్మలను తయారుచేస్తారు.

ప్రపంచములో గొప్పవయిన నిర్మల్ బొమ్మలు ఈ జిల్లాలోని నిర్మల్‌పట్టణంలో తయారు చేస్తారు. ఇవి బొమ్మలు అని చెప్పిన నమ్మలేనంత సహజంగా ఉంటాయి.

జిల్లాలో జొన్నలు ఎక్కువ పండిస్తారు. ఆ తర్వాత పత్తి, వరి, పప్పుధాన్యాలు, పండిస్తారు. కడెం, స్వర్ణ, సిరాల ప్రాజెక్టు, చెరువు, ఎత్తిపోతల ద్వారా నీటి పారుదల జరుగు తున్నది. పట్టుపురుగుల పెంపకం బాగానే కొనసాగుతున్నది. పత్తి మార్కెట్లోకి వచ్చే సీజనులో అదిలాబాదు, బైంసా మార్కెట్లలో పత్తిని పెద్ద గుట్టలుగా పోస్తారు. హిమాలయాలు ఎగిరి వచ్చి ఇక్కడ ఉన్నాయా అన్నంత అందంగా ఈ పత్తి గుట్టలు తెల్లగా వెలిగి పోతుంటాయి.


కాగజ్‌నగర్‌లో పెద్ద పేపర్‌మిల్లు ఉంది. అడవిని నరికితే వచ్చే వెదురు, ఇతర కలపల గుజ్జుతో కాగితాన్ని తయారుచేస్తారు. దేవాపూర్, అదిలాబాదు మంచిర్యాలలో ఎక్కువగా సిమెంటు తయారవుతుంది. మంచిర్యాల చుట్టూ సింగరేణి బొగ్గు గనులు ఉన్నాయి. మీకు అదిలాబాదు 'రంజన్'ల గురించి తెలుసా? రంజన్‌లు అంటే మామూలు మట్టి కుండలే కాని కొంచెం పొడవుగా మందంగా ఉంటాయి. వీటిలో నీళ్లుపోస్తే చాలా చల్లగా తయారవుతాయి.

దేశంలో ఉండే రెండే రెండు సరస్వతీ దేవి ఆలయాల్లో ఒకటి ఈ జిల్లాలోని బాసరలో ఉంది. జైనద్‌లో పురాతన జైన దేవాలయం ఉంది. చెన్నూర్ మండలంలో అగస్త్యేశ్వరుని గుడి ఉంది. ఇక్కడ శ్రీకృష్ణదేవరాయల కాలం నాటి శిలాశాసనం ఉంది. కెస్లాపూరులో 'నాగోబా' గుడి ఉంది. ప్రతి ఏటా జనవరిలో ఇక్కడ గిరిజనుల జాతర జరుగుతుంటుంది.

జిల్లాలో కుంటాల, పొచ్చెర, తదితర జలపాతాలున్నాయి కుంటాల రాష్ట్రంలో ఎత్తయిన జలపాతం. అడవి మధ్యలో ఉండే మహబూబ్ ఘాట్ కెరామెరి గుట్టలు ఎంతో బావుంటాయి. చూశారా! చెప్పుకుంటూ వస్తే ఎన్ని విశేషాలు వచ్చాయో మీరు కూడా మీ జిల్లా విశేషాలు సేకరించండి.







# జ్ఞానపదం



పరీక్షల్లో రాకపోతె
మీకు మంచి మార్కులు,
కలెక్టర్లు కాదు, మీరు
కాగలరట కార్కులు!

ఆట పాట లసలేమీ
వద్దని కా దర్థం,
ఎంతో విలువైన టైము,
చేయరాదు వ్యర్థం!

వారానికి ఒక్కసారి
చాలుమీకు వీడియో,
అప్పుడపుడు వినవచ్చును
వీలయితే రేడియో!


వ్యసనంగా మారరాదు
ఇంటివద్ద టీ.వీ.
సండే ఉదయాన తప్ప
పనికొచ్చే వేవీ?

కళ్ళు ఉరిమి చూసిందని
నిన్ను క్లాసు టీచరు,
అమ్మకి మొరపెట్టరాదు -
తనొక పూరుక్రీచరు!

వచ్చే సంచిక వరకూ
చాలును ఈ పాఠం,
నాకూ వేరే వున్నది
కద ఒక జంఝాటం!



దేవిప్రియ అంకుల్


Happy Diwali
పండ్ల రుచులనే
మైమరిపించే
Winky's
వింకీస్
స్వీట్స్ & టాఫీస్
apple pie
Mango Ripe
Grapes
PanMasala
SreeMaa MARKETING
29-22-24, Peesapativari Street Suryaraopet
VIJAYAWADA - 520 002. ( A. P. ) Phone : 64318

Let your tongue taste
the Variety

AGRAWALA
SWEETS

PHONE: 42857

5-4-18, J.N.ROAD, OPP: RAMAKRISHNA THEATRE
ABIDS, HYDERABAD-500 001.

*"Buy Today's
Handicrafts in Decades it is Antique"*

Ashoka's

HANDICRAFTS & GIFTS

6-2-29/3/9, LAKDIKAPOOL, HYDERABAD-500 004. A.P.
PHONE: 225689



# సంతృప్తి

కరుణ పుస్తకాల దుకాణం ముందు ఆగింది. దుకాణంలో రద్దీగా ఉంది. అయినప్పటికీ కరుణ ఆగడానికి లేదు. ఇంటికి త్వరగా వెళ్లవలసి ఉంది.

అయిదు రూపాయల నోటును దుకాణ దారుడికి ఇచ్చి, "రెండు వందల పేజీల రూళ్ల నోటు పుస్తకం ఇవ్వండి!" అంది.

దుకాణదారుడు అయిదు రూపాయల నోటు తీసుకున్నాడు. కరుణ అడిగిన నోటు పుస్తకం ఇచ్చి గల్లాపెట్టె వెతికి, మిగతా చిల్లర ఇవ్వబోయాడు.

మరో కొనుగోలుదారుడు అతడికి పది రూపాయల నోటు ఇచ్చి తనకి కావలసిన పుస్తకాల జాబితా చెప్పాడు.

దుకాణదారుడు ఓర్పుగా అతడికి కావలసిన పుస్తకాలను ఎంచి ఇచ్చాడు. ఆ కొనుగోలు దారుడు వెళ్ళిపోయాడు.

"నాకు చిల్లర ఇవ్వలేదండి" అంది కరుణ.

దుకాణదారుడు ఒక్కక్షణం పాటు గుర్తుకు తెచ్చుకుని, కరుణ చేతిలో ఆరు రూపాయలుంచాడు.

కరుణ బిత్తర పోయింది.

తాను ఇచ్చింది అయిదు రూపాయల నోటే! తనకు తిరిగి ఒక రూపాయి మాత్రమే ఇవ్వవలసిన దుకాణదారుడు పొరబాటు పడ్డాడు.

రద్దీలోంచి ఇవతలకి వచ్చింది కరుణ.

ఆమెలో ఒక పక్క ఆనందం, మరో పక్క గాభరా... దుకాణదారుడు తనతప్పు గ్రహించి తిరిగి పిలవడు కదా!

త్వరత్వరగా ఇల్లు చేరుకుంది కరుణ.

తనకి అయిదు రూపాయల లాభం ఎంత అదృష్టం. అయిదు రూపాయలతో ఎన్నో కొనుక్కోవచ్చు.

ఆ రాత్రంతా కరుణకు నిద్ర పట్టలేదు.

మరుసటిరోజు కరుణ ఆ దుకాణం ముందునుండి వెళ్తోంది. దుకాణదారుడిని చూసి అనుకోకుండా వణికింది. ఆ రోజు సాయంకాలం పాఠశాల నుండి తిరిగి వస్తూంటే అదే వణుకు.

దుకాణదారుడు తన కొడుకును దండిస్తున్నాడు.

కరుణకు క్రమంగా అర్థమవుతోంది.

నిన్న కొడుకు దుకాణంలో కొద్ది సేపు మాత్రమే కూర్చున్నాడట. ఉండవలసిన సొమ్ములో అయిదు రూపాయలు తగ్గాయి.

కరుణకు తెలుసు.

దుకాణదారుడి పరాకు వల్ల తగ్గిపోయిన డబ్బే అది. ఆ డబ్బు తనవద్ద ఉంది.

కరుణ చప్పున ఇంటికి పరుగెత్తి అయిదు రూపాయల నోటుతో తిరిగి వచ్చింది. సంగతి చెప్పి దుకాణదారుడికి ఆ నోటుని అందించింది. ఆమెలో కొత్త సంతృప్తి కలిగింది.

అయిదు రూపాయలతో అనుభవించే సంతృప్తి కన్నా ఆ డబ్బు తిరిగి దుకాణదారుడికి ఇవ్వడం వల్ల ఎక్కువ సంతృప్తి కలిగింది. అంతేకాదు. ఆమెలో అటు తర్వాత వణుకు పుట్టలేదు.

**ఎమ్.వి.వి. సత్యనారాయణ**

# ఈ నెల కథ

## అక్టోబర్


సూర్యుని చుట్టూ భూమి తిరగడం వల్ల రాత్రిపగలు ఏర్పడతాయి. భూమి తన చుట్టూ తాను 24 గంటల్లో తిరుగుతుంది. అలాగే సూర్యుడి చుట్టూ 365 రోజుల ఆరు గంటల్లో తిరుగుతుంది. చంద్రుడి గమనం వల్ల అమావాస్య పౌర్ణమిలు ఏర్పడుతున్నాయి. మన పూర్వులు వీటిని జాగ్రత్తగా గమనించి కాలానికి రోజులు, వారాలు, నెలలు, సంవత్సరాలు లాంటి ప్రమాణాలను ఏర్పాటు చేశారు. నెలలకు పేర్లు పెట్టారు. నెలలకు ఆ పేర్లు ఎలా వచ్చాయో తెలుసుకుందామా!

పూర్వం రోమను కాలెండరులో పది నెలలు మాత్రమే ఉండేవి. అందులో మొదటి ఆరు నెలలకు వారి దేవతల పేర్లు పెట్టారు. తర్వాత నెలలను ఏడవ నెల... ఎనిమిదవ నెల... అని పిలిచేవారు. రోమను భాషలో ఎనిమిదిని 'అక్టమ్' అంటారు. అందుకే ఎనిమిదవ నెల 'అక్టమ్' అయ్యింది. ఇదే క్రమేపి 'అక్టోబర్'గా మారింది. తర్వాత జూలియస్ సీజర్ చక్రవర్తిగా ఉన్నకాలంలో కాలెండర్‌లో రెండు నెలలు చేర్చి మార్పులు చేశారు. అప్పుడు ఎనిమిదవ నెల అయిన అక్టోబర్ పదవనెలయ్యింది.

శాలివాహన కాల పరిగణ ప్రకారం ఇది అశ్వయుజ మాసం. అశ్వనీ నక్షత్ర కాంతి పరిధిలో సూర్యచంద్రుల గమనాన్ని అనుసరించి ఈ నెలకు ఆ నక్షత్రం పేరున అశ్వయుజ మాసమని పేరు వచ్చింది.

## అనగా అనగా

# మంత్రి నక్క



అనగా అనగా ఒక అడవి. ఆ అడవికి ఒక సింహంరాజు. నక్క ఆ సింహానికి మంత్రిగా ఉండేది. అది గుంటనక్క, జిత్తులమారి కూడ. అది కపటోపాయంతో మాయమాటలు చెప్పి రోజుకో జంతువును రాజుగారికి ఆహారంగా తీసుకుని వస్తుండేది. ఆ జంతువును చంపి సింహం తినగా మిగిలిన మాంసాన్ని నక్క తింటుండేది. ఇలా తింటూండగా కొన్ని రోజుల తర్వాత అడవిలో జంతువులన్నీ అయిపోయాయి. సింహానికి ఆహారం దొరకకపోతే తననే చంపేస్తుందని నక్కకు భయం పట్టుకుంది. చిన్న ఉపాయం ఆలోచించింది.


'మృగరాజా ఈ అడవిలో జంతువులన్నీ అయిపోయి అటుచివర ఒక పులిమాత్రం ఉంది. అది మీ దగ్గరికి రానంటుంది. మీరే వెళ్ళి దాన్ని చంపి తినండి' అంది.

కూర్చున్న దగ్గరికే ఆహారం వస్తుంటే తిని సోమరిగా తయారైంది. తనిప్పుడు పులితో పోట్లాడి జయించలేదు. ఈ విషయం తెలిసే నక్క కుట్ర పన్నింది.

సింహానికి నక్క కుట్ర అర్థమైంది.

"పులి సంగతి రేపు చూస్తాను. ఇవ్వాల్టికి నువ్వున్నావుగా' అని నక్కపైవడి గుటకాయస్వాహ చేసింది.


(పిల్లలు.... ఇది పాతకథ. ఎన్నోసార్లు విని ఉంటారు. అందుకే దీన్ని అనగా అనగా కథ అందాం. ఇలాంటికథలు మీరు రాని పంపించవచ్చు. మీ ఫోటో, పేరుతో ప్రచురిస్తాం.)


Every Man's First Love
VILÄN
VESTS & BRIEFS
SHAH
SESHA SAYEE KNITTINGS (P) LTD. VIJAYAWADA – 520 016.





# కంప్యూటర్




పిల్లలూ ... ఈరోజుల్లో 'కంప్యూటర్' గురించి విననివారుండరు. ఎక్కడ చూసినా కంప్యూటర్ విషయమే. కంప్యూటర్ అనే పదం ఊతపదంలా తయారయింది. కానీ చాలా మందికి కంప్యూటర్ అంటే ఏమిటో సరిగా తెలియదు. ఐదేళ్ళ క్రితం నాకు కూడా కంప్యూటర్ అంటే ఒక రకమైన భయము, బెరుకు ఉండేవి. కంప్యూటర్‌తో చెలిమి చేయడం ఆరంభించిన కొద్ది రోజుల్లోనే ఆ బెరుకు పోయింది.

ముందుగా కంప్యూటర్ ఎలా ఉంటుందో, ఎక్కడెక్కడ ఉపయోగిస్తారో తెలుసుకుందాం. తర్వాత అది ఎలా పని చేస్తుందో, దాని గొప్పతనమేమిటో, దానికీ ఇతర యంత్రాలకు ఉన్న తేడా ఏమిటో తెలుసుకొందాం.

కంప్యూటర్ రకరకాల పనులు చేస్తుంది. లెక్కలు చేస్తుంది. సమాచారాన్ని నిలువ చేస్తుంది. బొమ్మలు గీస్తుంది. బ్యాంకుల్లో అకౌంట్లు చూస్తుంది. రోగ నిర్ధారణ చేస్తుంది. అచ్చుకోసం అక్షరాలను కూర్చి పెడుతుంది. పెద్ద భవనాలు, బ్రిడ్జీలకు కావలసిన ప్లాన్లను, ఊహాచిత్రాలను గీసి పెడుతుంది. వాతావరణ వివరాలను రికార్డు చేసి రాబోయే వర్షాలు, తుఫానుల సమాచారాన్ని తెలియ చేస్తుంది. ఇలా కంప్యూటర్ ఇదీ, అదని కాకుండా కొన్ని వేల, లక్షల రకాల పనులు చేస్తుంది. అవసరం, చేయాల్సిన పనినిబట్టి కంప్యూటర్ ఆకారం, పరిమాణం రూపొందుతుంది. అంతెందుకు మనం చేతికి పెట్టుకునే ఎలక్ట్రానిక్ గడియారము, జేబులో ఉంచుకునే క్యాలిక్యులేటర్ కూడా కంప్యూటర్లే. రకాలు, పరిమాణాలు వేరయినప్పటికీ ఇవి అన్నీ ఒకే మూల సూత్రంపై పని చేస్తాయి.

ఇక కంప్యూటర్ భాగాల గురించి తెలుసుకొందాం. టైప్‌రైటరులా ఉండే దానినే 'కీబోర్డ్' అంటాము. దీన్ని ఉపయోగించే మనం కంప్యూటర్‌తో ఏ పనైనా చేయించవచ్చు. కంప్యూటరులోకి సమాచారం పంపడానికి మనకు కావలసిన సమాచారం అడగటానికి దీన్ని ఉపయోగిస్తారు. ఇది సమాచారాన్ని కంప్యూటరులోకి పంపిస్తుంది కాబట్టి ఇది 'ఇన్‌పుట్ డివైజ్' అవుతుంది. కీబోర్డ్ నుండి


ఒక వైరు (కేబుల్) టి.వి.లాగ ఉన్న దానికి కలిపి ఉంటుంది. ఈ టి.వి.లాగా ఉన్నదానిని 'విడియో డిస్ప్లే యూనిట్' (వి.డి.యు) అంటాము. కీబోర్డ్ ద్వారా మనం టైప్ చేసిన సమాచారం ఇందులో గాజుతెరపై కనిపిస్తుంది. కంప్యూటరు మనకు ఇచ్చే సమాచారం కూడా ఇందులోనే కనిపిస్తుంది. దీని ద్వారానే సమాచారం కంప్యూటరు నుండి బయటికి వస్తుంది. కాబట్టి ఇది 'అవుట్‌పుట్ డివైజ్' అవుతుంది.

ఇలా కంప్యూటరులోకి సమాచారాన్ని పంపే ఉపకరణాలన్నీ ఇన్‌పుట్ డివైజ్ వర్గంలోకి వస్తాయి. కంప్యూటరులో నుండి మనకు సమాచారం అందించే డిస్ప్లే యూనిట్, ప్రింటర్ లాంటివి అన్నీ అవుట్‌పుట్ డివైజ్ లోకి వస్తాయి. ఈ రెండింటిని కలిపి క్లుప్తంగా ఐ/ఒ డివైజ్ అంటాము. పై బొమ్మలో ఒక డబ్బాలాగ ఉందే అదే అసలు కంప్యూటర్. ఈ డబ్బా గురించే మనం తెలుసుకుందాం



అన్నది. ముందు ఇది ఎలా పని చేస్తుంది. ఇందులో ఏయే భాగాలుంటాయో తెలుసుకుందాం. ఇప్పటికీ కబుర్లు చాలు. మిగతా కబుర్లు వచ్చే నెల...

**తోట రమేష్**





పిల్లలు చిన్నతసములోనే కంప్యూటర్ విద్యనభ్యసించి విజ్ఞానపథంలో ముందుకు పోవాలని ఆశిస్తున్న ఒక శ్రేయోభిలాషి సమర్పించిన వ్యాసం ఇది


# అమ్మమ్మ ఐడియా

రచన : చొక్కాపు వెంకటరమణ  బొమ్మలు : టి. గంగాధర్





నీమాట నేనిక నమ్మను నాకు సబ్బు వద్దు. బహుమతివద్దు ఫో!
ఈసారి బహుమతి లకపోతే ఇంకెప్పుడు నామాట నమ్మ వద్దులే సబ్బుతీసుకో!
బుజ్జిగాడిలో గొప్పమార్పు వచ్చిందండి! రోజూ రెండు సార్లుస్నానం చేస్తున్నాడు మూడు సార్లు సబ్బుతో ముఖం కడుగుతున్నాడు నాకు శ్రమ తగ్గింది.
ఈ సబ్బు ఎంతమంచి వాసన వస్తుందో చూశారా! ఎన్నిసార్లు దీనితో స్నానం చేసినా హాయిగా ఉంటుంది తెలుసా!
మీ అమ్మ వీడిమీద ఏదో చిట్కా ప్రయోగించి నట్లుంది.
నిజమేనండీ
మూడు రోజుల్లో సబ్బుబిళ్ళ పూర్తిగా అరిగిపోయింది. దానిమధ్య ఒక ఉంగరం ఉంది. బుజ్జిగాడు పరుగున అమ్మమ్మ దగ్గరికి వచ్చాడు.
అమ్మమ్మా! ఈ సబ్బులో బహుమతి ఉంది. నీవు నిజమే చెప్పావు. ఇదిగో ఉంగరం నావేలికి సరిగ్గా సరిపోయింది
నీవు చాలా అదృష్టవంతుడివిరా బుజ్జీ
ఈ ఉంగరంమీద ఏదో వ్రాసి వుంది చుశావా?
ఆరోగ్యం మహాభాగ్యం
"ఆరోగ్యం మహాభాగ్యం" తెలిసిందా బుజ్జీ! దీన్ని నీవేలికి పెట్టుకో ఎప్పుడూ ఈ మాట గుర్తుపెట్టుకో.
రోజూరెండుసార్లు స్నానం చేయటం అలవాటైన బుజ్జిగాడికి ఎప్పుడైన ఓ పూటస్నానం చేయక పోతే చిరాకుగా ఉండేది. అలా బుజ్జిగాడికి శుచి శుభ్రత అలవాటయ్యాయి.
రోజూస్నానం చేయాలి వ్యాధులు పారద్రోలాలి అశుభ్రతే అనారోగ్యం ఆరోగ్యమే మహాభాగ్యం
సమాప్తం

ఈ ఎనిమిది పిల్లి పిల్లల్లో రెండు కవల పిల్లలున్నాయి. ఆ రెండింటిని గుర్తుపట్టగలరేమో ప్రయత్నించండి. ఎంత త్వరగా గుర్తుపట్టగలరన్నది ముఖ్యం. ఊ క్విక్...!




జవాబు
1, 7

తల్లి కోడిక పిల్లలు ఎన్ని ఉన్నాయో లెక్క తెలియటం లేదట! మీరు లెక్కపెట్టి చెప్పగలరా?



46

చక్రవ్యూహంలో చొరబడి బయటికి రాగలరేమో ప్రయతించండి



VIJAYA BOOK HOUSE
HIMAYATNAGAR, HYD-29

బాల చెలిమి
పిల్లల సమాచార పత్రిక
అక్టోబర్
సంపుటి 1 : సంచిక 1

Phone : 231117
CDR HOSPITALS
HYDERGUDA, HYD - 29.

## పెద్దవారితో పోటీకి దిగిన అయిదేళ్ళ బాలుడు నవీన్

వయస్సుతో సంబంధం లేకుండా సాధన వల్ల కష్టమైన పనిని కూడా సాధించ వచ్చని చిరంజీవి నవీన్ నిరూపించాడు.

అయిదు సంవత్సరాల నవీన్ ఇప్పుడు సికింద్రాబాద్‌లోని సెయింట్ పీటర్స్ పాఠశాలలో ఒకటవతరగతి చదువుతున్నాడు. నవీన్ అయిదు కిలోమీటర్ల పరుగు పందెంలో పాల్గొని, పెద్ద వారితో సమానంగా పరిగెత్తాడు. అయిదు కిలోమీటర్లను దాదాపు 26 నిముషాల్లో పరిగెత్తి పెద్దవారినే ఆశ్చర్య పరిచాడు.

నవీన్ తండ్రి శ్రీ సంజీవరెడ్డి ప్రోత్సాహంతో రోజూ సాధన చేసేవాడు. నవీన్‌కు ఎన్నో బహుమతులు వచ్చాయి. నవీన్ ఎదిగి ఒలంపిక్స్ స్థాయికి చేరి జెస్సీ ఓవెన్స్ లాంటి వారిని మించి పోతాడని ఆశిద్దాం. మధ్యలో జెస్సీ ఓవెన్స్ ఎవరా అనుకుంటున్నారా? జెస్సీ ఓవెన్స్



అమెరికన్ నీగ్రో ఆటగాడు. 1936 బెర్లిన్ ఒలింపిక్స్‌లో పరుగు పందెంలో 'అమెరికాకు ఇక పతకాలు రావు' అనుకున్నప్పుడు జెస్సీ ఓవెన్స్ వరుసగా నాలుగు బంగారు పతకాలు సంపాదించాడు. జెస్సీ నీగ్రో అయినందుకు అప్పటి జర్మని నియంత హిట్లర్ జెస్సీతో చేయి కలపడానికి నిరాకరించాడు. ఆ విధంగా జెస్సీ చరిత్ర సృష్టించారు.

## అర్జున అవార్డులు



ఆటల్లో చక్కని ప్రతిభచూపిన వారికి జాతీయస్థాయిలో అర్జున అవార్డు ఇస్తారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో విజేతలకు ఈ బహుమతిని రాష్ట్రపతి స్వయంగా అందిస్తారు. బాణంతో మత్స్య యంత్రాన్ని కొడుతున్న అర్జునుడి కంచు ప్రతిమతో పాటు ఇరవై వేల రూపాయల నగదును బహుమతిగా ఇస్తారు.

ఈ ఏడాది ఐదుగురు క్రీడాకారులకు ఈ అవార్డును ఇచ్చారు. వారు కుమారి అశ్వని నాచప్ప (అథ్లెట్), మహేందర్ పాల్ (హాకీ), విల్సన్ చెరియన్ (ఈత), సి.కె. యశోద (పవర్‌లిఫ్టర్), రాజేష్ కుమార్ (కుస్తీ).


## జూనియర్స్ వింబుల్డన్ సాధించిన భారతీయ బాలుడు

టెన్నిస్‌లో వింబుల్డన్ ప్రతిష్ఠాత్మకమైన ఆట. వింబుల్డన్‌లో గెలిచిన వారిని టెన్నిస్ ప్రపంచ విజేతగా గుర్తిస్తారు. ఈ పోటీలు లండన్‌లో జరుగుతాయి. ప్రపంచంలో చాలా దేశాలలోని ఆటగాళ్ళు ఈ పోటీలో పాల్గొంటారు. జులైలో జరిగిన వింబుల్డన్ ఆటల్లో భారతీయ బాలుడు 'లియాండర్ పేస్' జూనియర్ టైటిల్ సాధించాడు. బాలుర విభాగంలో మన 'లియాండర్ పేస్ ప్రపంచ విజేత అన్న మాట. ఇది భారతీయ టెన్నిస్ రంగానికి శుభసూచకం. లియాండర్ పేస్ మద్రాసులోని సెంట్ మేరిస్ స్కూల్‌లో చదువుతున్నాడు. పేస్ పెరిగి పెద్దవాడై టెన్నిస్‌ని బాగా ప్రాక్టీస్ చేసి వింబుల్డన్ టైటిల్‌ని కూడా సాధిస్తాడని ఆశిద్దాం.

## సెకనుకు 126 కిలోమీటర్ల వేగంతో పయనించే వ్యోమనౌక

మానవ జీవితాలను, భూమిగమనాన్ని ఎన్నో రకాలుగా శాసిస్తున్న సూర్యగ్రహం గురించి మరిన్ని విశేషాలు తెలుసుకోవడానికి అమెరికా, యూరప్ దేశాలవారు యులిసెస్ పేరున్న వ్యోమనౌకను అంతరిక్షంలోకి పంపిస్తున్నారు. ఈ వ్యోమనౌక అంతరిక్షంలో అయిదేళ్ళు ఉంటుంది.

సూర్యునిలో వాయువులు, సూర్యుడి ఆకర్షణశక్తి, సోలార్ విండ్‌ప్లాస్మా, కాస్మిక్ కిరణాలు, కాస్మిక్ ధూళి మొదలైన వాటి వివరాలు ఈ యులిసెస్ ద్వారా తెలుస్తాయి. ఇది సెకనుకు 126 కిలోమీటర్ల వేగంతో పయనిస్తుంది. ఇది అంతరిక్షంలో అతివేగంగా పయనించే తొలిమానవ నిర్మిత వాహనం అవుతుంది. ఇంతవేగంగా వెళ్ళినప్పటికి ఇది సూర్యుడి దగ్గరికి వెళ్ళడానికి



వ్యోమనౌక

రెండున్నర సంవత్సరాలు అవుతుంది.

## చెలిమి
### పిల్లల సమాచార పత్రిక

సంపుటి : 1 సంచిక: 1 అక్టోబర్ 1990

## సంపాదకీయం

"చెలిమి సమాచారం" పిల్లల సమాచార పత్రిక లాంటిది. వచ్చే సంచికనుండి పిల్లలే దీన్ని నిర్వహిస్తారు. ఇందులో పిల్లలకు ఆసక్తి కలిగించే విషయాలు, సామాన్య పరిజ్ఞానం పెంచే అంశాలు, రాష్ట్రంలోని వివిధ పట్టణాల నుండి 'చెలిమిక్లబ్' సభ్యులు పంపిన బాల లోకం వార్తలుంటాయి. నవంబర్ సంచికలోని 'చెలిమి సమాచారం'ను జి. విజయ్ అనే హైదరాబాద్ విద్యార్థి నిర్వహిస్తాడు. చెలిమిసమాచారం పై మీ అభిప్రాయాన్ని రాసి దీన్ని మీకు ఉపయోగపడేలా తీర్చిదిద్దడానికి సహకరించండి.

సంపాదకుడు

## ప్రధానికి టోపీ ఇచ్చిన మేనకా

కేంద్ర అడవులు పర్యావరణ శాఖ మంత్రి శ్రీమతి మేనకాగాంధీ. ప్రధాని విశ్వనాధ ప్రతాప్‌సింగుకు ఈ మధ్య రెండు టోపీలను బహుకరించారు. ఇవి కృత్రిమ ఉన్నితో చేసినవి. టోపీలు ఇస్తూ మేనకా గాంధీ ఇలా అన్నారు. "మీరు ధరిస్తున్న టోపీ బీహారులో ఉండే ఒక రకమైన కుందేలు చర్మంతో చేసినది. ఈ అమాయకపు జంతువులను చర్మకోసమే చంపి, వాటి చర్మాన్ని ఒలిచి టోపీలను కుడతారు. మీరు ఆ టోపీలను ధరించడం పరోక్షంగా కుందేళ్ళను చంపడానికి ప్రోత్సహించడమే కదా! అందుకే ఇకముందు కృత్రిమ ఉన్నితో చేసిన టోపీలనే వాడండి". ఈ మాటలు విని ప్రధాని తను చేస్తున్న పొరపాటు తెలుసుకొని అసలు టోపీనే వాడటం మానేశారు. వాడినా జంతు చర్మంతో తయారైన టోపీని వాడటం లేదు.

## 1990 జ్ఞానపీఠ్ అవార్డు



ఉన్నత సాహిత్య విలువలున్న పుస్తకానికి జాతీయ స్థాయిలో ఏటా ఇచ్చే 'జ్ఞానపీఠ్' అవార్డ్ ఈ ఏడాది ఉర్దూ రచయిత్రి శ్రీమతి 'కుర్రతుల్-ఇన్-హైదర్'కు ఇచ్చారు. ఆమె 1959లో రాసిన 'ఆగ్ కే దరియా' పుస్తకానికి ఈ అవార్డు వచ్చింది. శ్రీమతి కుర్రతుల్ 63' సంవత్సరాల క్రితం అలీఘడ్‌లో జన్మించారు.

గత ఏడాది ఈ బహుమతి మన తెలుగు కవి డాక్టర్ సి. నారాయణరెడ్డి (విశ్వంభర)కి ఇచ్చారు. అంతకు ముందు మరో తెలుగు కవికి ఈ బహుమతి వచ్చింది. ఆయనెవరో మీకు తెలుసా? శ్రీ విశ్వనాధ సత్యనారాయణ (శ్రీమద్రామాయణ కల్ప వృక్షం)

## వ్యాసరచన పోటీ ఫలితాలు

మారుతున్న సమాజంలో కోరుతున్న విద్య. అనే అంశంపై హైదరాబాద్‌లోని చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ ఎకాడమీ వారు నిర్వహించిన వ్యాస రచన పోటీ ఫలితాలు.

సింహాచలం, నవోదయ పాఠశాలకు చెందిన జి.వి.ఎన్. నాయుడు పంపిన వ్యాసం ఉత్తమమైనదిగా ఎంపికైంది. ఇదే పాఠశాల విద్యార్థి ఎన్. అప్పారావు పంపిన వ్యాసం కొన్సలేషన్ బహుమతి గెల్చుకొంది.

నల్గొండ జిల్లా నవోదయ పాఠశాల విద్యార్థి వి. వెంకటేశ్వర్లుకు ద్వితీయ బహుమతి, కరీంనగర్ జిల్లా గంభీరావ్‌పేట్ అప్పర్ ప్రైమరి స్కూల్ విద్యార్థిని కిరణ్మయికి మూడవ బహుమతి వచ్చింది.

విజేతలకు బహుమతులు పోస్టులో అందుతాయని అకాడమీ డైరెక్టర్ తెలిపారు. వ్యాసాలు పంపిన వారందరికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.



పెద్దవాళ్ళు ఏళ్ళ తరబడి కష్టపడి సాధించలేక గొప్పవనుకునే పనులను కొందరు చిన్నారులు ఆకలయి గుక్కపట్టి ఏడ్చినంత సహజంగా, సులభంగా కొన్ని పనులు చేసేస్తుంటారు. అద్భుతమైన ప్రతిభను కనబరుస్తారు. అమాయకత్వం, అందం ఈ ప్రతిభకు తోడైతే ఇక చెప్పక్కరలేదు.

సరిగ్గా ఈ కోవకు చెందిన పాపాయి బేబిషామిలి. షామిలికి నిండా మూడేళ్ళయినా రాలేదు. అయినా అద్భుతంగా నటించ గలుగుతుంది. మానవమాత్రుడు మోయలేనంతటి విషాదాన్ని కురిపించే పాత్రలో పాలు తాగినంత సులభంగా నటించేసింది.

మానసికంగా ఎదగని పాపగా 'అంజలి' సినిమాలో అతిసహజంగా నటించి అందరి మెప్పును పొందిన ఈ పాపకు మంచి భవిష్యత్తు ఉందని చెప్పవచ్చు. షామిలి నటే కాదు. మంచి మోడల్‌కూడా. ఇప్పటివరకు వందకు పైగా గ్రీటింగ్ కార్డులకు మోడల్‌గా పనిచేసింది.




### పాకెట్‌కార్టూన్



" పసిపిల్లలకు కూడా అర్థం అయ్యే రచన పువ్వులు" - బిషప్ కోన్స్
"చదువుకు లక్ష్యం; చక్కని నడవడిని అలవరచడం" - హెచ్. స్పెన్సర్

## చుక్కలు కలపండి, చక్కని బొమ్మ ప్రత్యక్షం అవుతుంది.



పిల్లలు మీకు ఒకటి నుండి వంద వరకు అంకెలు లెక్క పెట్టడం వచ్చు గదా! ఒకటవ నంబరు చుక్క నుండి 100 వ నంబర్ చుక్క వరకు చుక్కలను వరుసగా కలపండి.. అంతే. చల్ చల్ గుర్రం ప్రత్యక్షం అవుతుంది.


మీరు బంతిని గాలిలో తేలియాడించగలరా?



సైన్స్‌లోని అద్భుతాలను కనుగొనండి

లేదా
శతాబ్దాలుగా నిక్షిప్తమైన
విజ్ఞాన సంపదను

బి.ఎం.బిర్లా
సైన్స్ మ్యూజియంలో
తిలకించండి

ఉ. 10.30 గం. నుండి
రాత్రి 8.30 గం. వరకు

అలాగే, విశ్వంలోని వింతలను
బి.ఎం.బిర్లా ప్లానెటేరియంలో
చూడండి

బి.ఎం.బిర్లా
ప్లానెటేరియం

వివరాలకు వేళలకోసం
235081 ఫోన్ చేయండి

బి.ఎం.బిర్లా
సైన్స్ సెంటర్

ఆదర్శనగర్, హైదరాబాద్-500 463

గంటల కొలది వినోదం
భారతదేశంలో దీనికిదే సాటి!!

# ట్రైనాల్

## (ట్రైకాంటినాల్)

### ట్రైనాల్ వాడుటవలన కలుగు లాభములు :

ట్రైనాల్ మన పంటలలోని కణాల యొక్క పెరుగుదలను పెంపొందించును. రైతుకు సేవాదృక్పథముతో లాభసాటికోసం 'ట్రైనాల్' అనే మందు మీకు అందిస్తున్నాము.

ట్రైనాల్ స్ప్రే చేయుట వలన పంటలు బాగుగా పెరుగును. పైర్లకు పోషక పదార్థములు పీల్చుకొను శక్తిని పెంపొందించును. ఇదియును గాక పైర్లు దెబ్బతినిన భాగములను కూడా బాగుచేయును. కావున పోషక పదార్థములను తీసుకొను శక్తి పంటలకు కలుగును.

ట్రైనాల్, (ట్రైకాంటినాల్) పత్తి, మిరప, వరి, కూరగాయలు, పూలమొక్కలు, నూనెగింజలు, మామిడి, నిమ్మ, ద్రాక్ష మొదలగు పండ్లతోటలలో వాడదగ్గ సరికొత్త మందు.

ట్రైనాల్‌ను ఏ ఇతరత్ర మందులతో కలిపి పిచికారి చేసినను ఎటువంటి హాని కలుగదు.




Relaent Chemicals Hyderabad

ఇతరవివరములకు : రిలయెంట్ కెమికల్స్, 1-10-10, అశోకనగర్, హైదరాబాదు - 500 029 వారిని సంప్రదించండి


కోట్లాది ప్రజలు కోరుకునే
త్రివేణి
వక్కపొడి
ప్రతి పలుకు ఎంతో తృప్తిని ఇస్తుంది!
నిజం చెప్పాలంటే త్రివేణి కి మించింది లేదు!
నాణ్యత మాతయారి
ఖ్యాతి తెచ్చినది భారత ప్రజలు
ప్రముఖ హాస్యనటుడు "వేలు"
అభిమానించేది 'త్రివేణి'
TRIVENI
NUT POWDER
50 PS
25Ps
TRIVENI
SWEET SUPARI
SPECIAL
QUALITY
TRIVENI
SUGANDHI SUPARI
Triveni
TRIVENI
SUGANDHI SUPARI
TRADE MARK REGD
త్రివేణి నట్‌పౌడర్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెని
మచిలీపట్నం-520 001, ఫోన్: 3458
BABU ADS/Outline

# అభ్యాసం కూసు విద్య

ఎంత కష్టమైన పని అయినప్పటికి అభ్యాసం చేస్తే నేర్చుకోవచ్చు. ఏదయినా సరే అభ్యాసం చేస్తే రాకపోవటం అనేది ఉండదు. కొంతమంది పెద్దవాళ్ళు పలు విషయాల పట్ల ఆసక్తి చూపుతుంటారు. కానీ ప్రయత్నించినా బాగా నేర్చుకోలేక పోయాం అని అంటూ ఉంటారు.

కాని వారు చెప్పేది తప్పు. అభ్యాసం ద్వారా నేర్చుకోలేక పోవటం అన్నది ఉండదు. మనుషులే కాదు జంతువులు కూడా అభ్యాసం ద్వారా విషయాలను హాయిగా నేర్చుకొంటాయి. తమకు ఎంతమాత్రం పరిచయం లేని విషయాన్ని అతి తక్కువ కాలంలో అభ్యాసం ద్వారా తెలుసుకో గలుగుతాయని శాస్త్రవేత్తలు చిన్న ప్రయోగం ద్వారా రుజువు చేశారు.


ఒకరకం గోధుమరంగు ఎలుకను ఓ పెట్టెలో ఉంచారు. దానికి కావల్సిన ఆహారం యాంత్రికంగా అందేట్లు చేశారు. పెట్టెలో ఓ విద్యుత్ బల్బును ఉంచి, దాని స్విచ్‌ను పెట్టె లోనే ఒకచోట అమర్చారు.

ఆహారం ఉండేచోట చిన్న తలుపు లాంటి దాన్ని అమర్చి ఇంకో స్విచ్ నొక్కితే అది తెరుచుకొనేలా ఏర్పాటు చేశారు. ఇలా పెట్టెలో రెండు స్విచ్‌లు ఏర్పాటు చేశారు.

పెట్టెలో లైటు ఆర్పివేసి చీకటిని కల్పించారు. చీకటిలో ఎలుకకు చికాకు కలిగి పెట్టె గోడలను గోకేది, రక్కేది. దీంతో స్విచ్‌పై ఒత్తిడి ఏర్పడి పెట్టెలో బల్బు వెలిగేది. ఇలా పదే పదే చేసిన ప్రయత్నాల వల్ల మొదటి స్విచ్ నొక్కితే బల్బు వెలుగుతుందని, రెండవ స్విచ్ నొక్కితే ఆహారం ఉన్నచోట తలుపు తెరుచు కుంటుందనే విషయం ఎలుకకు తెలిసింది.


కొంతకాలం ఎలుకను అందులోనే ఉంచి ప్రయోగం చేశారు. ఎలుకకు ఎప్పుడు ఆకలి వేసినా ముందు లైటు వెలిగే స్విచ్‌ను నొక్కేది. తర్వాత తలుపు తెరుచుకునే స్విచ్ నొక్కేది చూశారా! అభ్యాసం ద్వారా ఎలుక ఆ విషయాన్ని ఎలా నేర్చుకుందో.

నిజానికి ఎలుకకు ఈ పెట్టె విషయం, అందులో స్విచ్ నొక్కితే ఆహారం దొరుకు తుందనే విషయం ముందు బొత్తిగా తెలియదు.



కానీ ఎలుక చేసే పలు ప్రయత్నాల్లో స్విచ్ నొక్కడం, స్విచ్ నొక్కగానే ఆహారం దొరికే చోట తలుపు తెరుచుకోవడం జరిగింది. ఇదే పనిని పదే పదే చేయడం వల్ల ఎలుకకు ఆహారం కోసం ఏమి చేయాలో తెలిసింది. ఆకలి వేయ గానే స్విచ్ నొక్కాలన్న విషయం చిట్టెలుకకు అభ్యాసం వల్లనే తెలిసింది. ఈ విషయాన్ని ఇంత శాస్త్రీయంగా రుజువు చేసిన శాస్త్రవేత్తల మాట ఎవరైనా నమ్మాల్సిందే కదా!

గిరిజా నారాయణ్









## ధీమాను పెంచి ఆనందం పంచే దీపావళి

అజ్ఞానంపై జ్ఞానం....
అన్యాయంపై న్యాయం...
దానవత్వంపై మానవత్వం ...

చీకటిపై వెలుగు విజయానికి ప్రతీకగా కాశ్మీరు నుండి కన్యాకుమారి వరకు భారతదేశం అంతటా ఈ పండుగను జరుపుకొంటారు. మానవజాతి ప్రగతికి మూలకారణం అయిన అగ్నిని ఆరాధించే ఆచారంలోంచి పుట్టిన పండుగ ఇది. దీపావళి పండుగ నాటికి పంటలు చేతికి అందుతాయి. కాబట్టి దీన్ని 'భూసార పండుగ'గా కూడా జరుపుకుంటారు.

నమ్మకాలు, ఆచారాలు ఎలా ఉన్నా ఇది పిల్లలు ఆనందంగా జరుపుకునే పండుగ. రంగు రంగుల కాంతులు వెదజల్లే టపాకాయలు, నిప్పురవ్వలు వెదజల్లుతూ జుయ్‌మని ఆకాశంలోకి లేచే రాకెట్లు, తారాజువ్వలు, జర్రున పాకే పాములు ఇలా రకరకాల టపాకాయలు కాల్చి ఆనందించే పండుగ ఇది. ఆనందంతో పాటు ఆత్మ విశ్వాసాన్ని, ధీమాను పెంచే పండుగ ఇది.

అక్టోబర్ 18న అమావాస్య నాడు ఈ పండుగ వస్తున్నది. రాత్రిని ప్రకృతి చీకటి రాత్రిగా చేస్తే మానవుడు దీపాలను వెలిగించి చీకటిని పారద్రోలాడు. అరాచకత్వానికి, ప్రతీకగా ఉన్న నరకున్ని శ్రీకృష్ణుడు వధించడం దుష్టుడైన రావణుడిని రాముడు చంపడం, విక్రమాదిత్య శకారంభం, లక్ష్మీదేవి పునరాగమనం లాంటి పురాణ కథలు కూడా ఈ పండుగ జరుపుకోవడం వెనుక ప్రచారంలో ఉన్నాయి.



# కుడి ఎడమైతే

ఆరోజు ఆదివారం!

పాఠశాలకు సెలవు.

పొద్దున్నే లేచి స్నానం చేసి తయార య్యాను. ఆ రోజు నాకు చాలా ఆనందంగా ఉంది. నాన్న కూడా ఇంటి దగ్గరే ఉన్నారు.

తొందరగా తయారయి, అమ్మ టిఫిన్ తినమని పిలుస్తున్నా వినక పరిగెత్తుకొచ్చి దొడ్లో ఉన్న సైకిల్ తీశాను.

నేను ఈ మధ్యనే సైకిల్ తొక్కడం నేర్చు కున్నాను. సైకిల్ తొక్కడం కొద్దిగా వచ్చు. నడిచేటప్పుడూ లేదా ఏదైనా వాహనం నడిపే టప్పుడు 'ఎడమనుండి వెళ్ళాలని' మాష్టారు చెప్పిన మాటలు నాకు చాలా గుర్తు.

సైకిల్ తీసి రోడ్డుపైకి వచ్చి తొక్కడం ప్రారంభించాను. "నాకు సైకిల్ తొక్కడం వచ్చు" అని పక్క వీధిలోని మా మామయ్యకు చూపెట్టేందుకు నా తొందర. మెల్లిగా రోడ్డుకు ఎడమవైపు నుండి సైకిలు తొక్కుతూ ఎలాగైతేనేం మా మామయ్య ఇంటికి వెళ్ళాను.

"నాకు సైకిల్ తొక్కడం వచ్చు" అని చెప్పగానే మా మామయ్య, అత్తమ్మ చాలా సంతోషించారు. నాకు కాస్త గర్వం అనిపించింది. వాళ్ళింట్లో టిఫిన్‌చేసి మళ్ళి సైకిల్‌పై మా ఇంటికి బయలు దేరాను. నాకు ఎదురుగా ఓ వ్యక్తి సైకిల్‌పై వస్తున్నాడు.

'రోడ్డుకు ఎడమవైపునుండి వెళ్ళండి' అని అన్నాను.

ఆ వ్యక్తి నావైపు వింతగా చూసుకుంటూ వెళ్ళాడు. కాసేపటికి ఇంకోవ్యక్తి అలాగే రావటం చూసి మళ్ళి అదేమాట అన్నాను.

అతనుకూడా నావైపు అదోలాచూసి వెళ్ళిపోయాడు. నాకేం అర్థం కాలేదు.

ఎదురుగా మా నాన్నగారు సైకిల్‌పై వస్తున్నారు.

మళ్ళి అదేమాట అన్నాను.

మా నాన్న సైకిల్ ఆపి

"ఏరా నీ కుడిచేయి, ఎడమచేయి మరిచి పోయావా. కుడిచేయి వైపు వస్తూ నాకే చెపుతున్నావ్" అని అన్నాడు.

అప్పుడుగాని నాకు అర్థంకాలేదు.

నేను వెళ్ళేప్పుడు ఎడమ వైపే వెళ్ళాను. కాని మళ్ళి వచ్చేప్పుడు అదే ఎడమవైపు అనుకుని అలాగే వస్తున్నాను.

(గోదావరిఖనినుండి చిరంజీవి వంశీకృష్ణ పంపిన కథ)

శుభాకాంక్షలతో : జి. రాఘవరెడ్డి

# జీవనదాత సూర్యుడు

సూర్యుడు ప్రపంచానికి వెలుగును, వేడిని ఇస్తాడు. అంత వేడి వెలుగు సూర్యునిలో ఎక్కడినుంచి వస్తుందో తెలుసా? అణుశక్తి, పరమాణుశక్తి, అణుబాంబు, హైడ్రోజన్ బాంబు గురించి మీరు విన్నారు కదా. చిన్నదిగా ఉండే అణువులో ఎంతో శక్తి దాగి ఉంటుంది. అణువును ఛేదించ గలిగితే ఆ శక్తి బయిటికి వస్తుంది. అలా అణువును ఛేదించి విపరీతమైన శక్తిని వెలువరించే పరికరమే అణుబాంబు. అణువుల్లో చిన్నది పరమాణువు. ఇందుకు ఉదాహరణ హైడ్రో జన్ పరమాణువు. ఇందులో మరింత శక్తి ఉంటుంది. అందుకే హైడ్రోజన్ బాంబు అణుబాంబు కన్నా శక్తివంతమైంది. అణువును ఛేదించడం చాలా కష్టమైన పని. దానికి ఎంతో శాస్త్ర విజ్ఞానం, సున్నితమైన శాస్త్ర పరికరాలు కావాలి. ఇవన్నీ ఉన్నా కూడా అణువును ఛేదించాలంటే చాలా కష్టం.

మనం ఇక్కడ ఇంత కష్టపడినా సాధ్యం కాని అణు విచ్ఛేదనం సూర్యునిలో దానంతట అదే జరుగుతుంది. మండే సూర్యునిలో ఉన్న మూలకాలు గాలిరూపంలో ఉంటాయి. వాటిలో హైడ్రోజన్ పరమాణువులు ఎల్లప్పుడు విడిపోతూ ఎంతో వేడిని, వెలుతురును వెదజల్లుతుంటాయి. ఆ వేడి, వెలుతురులే భూమిపైకి కాంతి కిరణాల రూపంలో ప్రసరిస్తున్నాయి. ఇందులోని వేడిని మొక్కలు కిరణజన్య సంయోగక్రియ ద్వారా తమలో నిల్వ చేసుకుంటాయి. ఆ మొక్కల భాగాలను జీవకోటి స్వీకరించటం ద్వారా ఆ వేడిని మనుషులతో సహా ఇతర జంతువులు కూడా వినియోగించుకొంటున్నాయి.

మనుషుల్లో జంతువుల్లో జరిగే జీవన వ్యాపారాలన్నింటికి సూర్యశక్తే మూలాధారం అన్నది అర్థమైంది కదా. మొక్కల్లో ఆహారం సూర్యరశ్మి వలన ఉత్పన్నమవుతుందని, సూర్య కిరణాల సాయంతో మానవ శరీరంలో 'డి' విటమిన్ ఉత్పత్తవుతుందని శాస్త్రజ్ఞులు కనిపెట్టారు. అందుకే వైద్యులు చంటిపిల్లల్ని లేత ఎండలో పడుకోబెట్టాలని చెప్తుంటారు. ప్రకృతి వైద్యులు సూర్యరశ్మిని అనేక చర్మ వ్యాధులను నయం చేయడానికి వినియోగిస్తున్నారు. విదేశాల్లో సూర్యరశ్మి కోసం 'సూర్య స్నానాలు' (సన్‌బాత్) చేస్తారు. మనదేశంలో

ఆరోగ్యపరంగా సూర్య నమస్కారాలని అనాదిగా ఉన్నాయి. ఇన్ని రకాలుగా సూర్యుడు మన జీవితంలో ముడిపడి ఉన్నాడు.

భూమి నుండి చూస్తే సూర్యుడు ఫుట్‌బాల్ అంత పరిమాణంలో కనిపిస్తాడు. కాని సూర్య గ్రహం భూమికన్నా కొన్ని వందల రెట్లు పెద్దదిగా ఉంటుంది. దాని వ్యాసం 14 లక్షల కిలో మీటర్లు. ఇది భూమి వ్యాసం కన్నా 109 రెట్లు ఎక్కువ. భూమి నుంచి 15 కోట్ల కిలో మీటర్ల దూరంలో ఉన్నాడు కాబట్టి ఇక్కడి నుండి చూస్తే అంత చిన్నగా కన్పిస్తున్నాడు. అంతదూరం నుండే నిప్పులు కురిపించే ఎండను వెదజల్లుతున్నాడు. అక్కడికే వెళితే ఎంత వేడి ఉంటుదో ఊహించండి. అమ్మో! మాడి మసైపోము! ఊహించడానికే భయం వేయటం లేదూ..?!

సూర్యుడికన్నా భూమి చిన్నది. భూమి కన్నా చందమామ మరింత చిన్నది. చందమామ కురిపించే చల్లని వెన్నెల వెలుతురు కూడా సూర్యుడిదే. ఇది ఎట్లాగంటే సూర్య కిరణాలు చంద్రుని మీద పడి అవి పరావర్తనం చెంది భూమి పైకి వస్తాయి. ఈ క్రమంలో ఆ కిరణాలలోని వేడిని కాస్త చంద్రుడు భరిస్తాడు. మనకు చల్లని కిరణాలను ఇస్తాడు. అందుకే చందమామ మంచివాడు. పిల్లలకు మామ వాడు.

## ప్రతిభ ఉన్న విద్యార్థులకు చదివినన్ని రోజులూ స్కాలర్ షిప్ నేషనల్ టాలెంట్ సెర్చ్‌స్కీం

ఎన్.సి.ఇ.ఆర్.టి వారు పదవ తరగతి పాస్ అయిన విద్యార్థుల్లో ప్రతిభ ఉన్న 750 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఇస్తారు. ఆ విద్యార్థి చదివినన్ని రోజులు స్కాలర్‌షిప్ ఇస్తూనే ఉంటారు. అయితే ప్రతిభ ఉన్న విద్యార్థులను ఎంపిక చేసుకోడానికి రెండు అంచెల పరీక్షలను నిర్వహిస్తారు. ఒకటి రాష్ట్ర స్థాయిలో, రెండవది జాతీయ స్థాయిలో. పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్ష రాయడానికి అర్హులు.

సాధారణంగా ఈ పరీక్ష డిసెంబర్‌లో ఉంటుంది. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో అన్ని పత్రికల్లో ప్రకటన వస్తుంది. ఈ పరీక్షలను రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల విభాగం జాయింట్ కమీషనర్ వారు నిర్వహిస్తారు. ధరఖాస్తు ఫారాలు డి.ఇ.వో. (జిల్లా విద్యాశాఖాధికారి) నుండి తీసికోవాలి. వారి ద్వారానే పంపించాలి. ఈ పరీక్ష రెండు భాగాలుగా ఉంటుంది. మొదటిది మెంటల్ ఎబిలిటి. రెండవది 8,9,10 తరగతుల పాఠ్యాంశాలపై ఉంటుంది. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన 525 మంది విద్యార్థులకు రెండవ పరీక్ష ఉంటుంది. ఇది మాత్రం ప్రతి ఏడాది మేలో వచ్చే రెండవ ఆదివారం రోజునే ఉంటుంది. ఎంపికైన విద్యార్థులకు ఇంటర్ స్థాయిలో నెలకు 150 రూపాయలు ఇస్తారు. ఇది కాకుండా పుస్తకాలు కొనుక్కోవడానికి ఏడాదికి రెండు వందలు అదనంగా ఇస్తారు. గ్రాడ్యుయేషన్ స్థాయిలో నెలకు రెండువందలు, పోస్ట్‌గ్రాడ్యుయేషన్ స్థాయిలో ఇది మూడు వందలు అవుతుంది.

## రచయితలకు, ఆర్టిస్టులకు, ఫోటోగ్రాఫర్లకు ఆహ్వానం

**రచయితలకు :**

పిల్లలకు ఉపయోగపడే విధంగా ఉండే రచనలను చెలిమి ఆహ్వానిస్తుంది.

* రచనలు ఫుల్‌స్కేప్ కాగితానికి ఒకవైపునే రాయాలి.
* రచన స్వంతమో, అనుకరణదో, అనువాదమో తెలియ జేయాలి.




* షర్ట్స్
* T షర్ట్స్
* ట్రౌజర్స్
* జీన్స్
* సఫారి సూట్స్ &
* వెడ్డింగ్ చూడిదార్ కుర్తా సూట్స్

ఇంకా లూయిస్ ఫిలిప్పీ
THE SIGNED SHIRT
లభించును.

ఆంధ్రప్రదేశ్‌లోని అత్యంత విలాసవంతమైన షోరూమ్ మన్‌హర్‌లో అడుగు పెట్టండి. పురుషులకు ప్రతిష్టాత్మక షోరూమ్ అది. రేమాండ్స్, గ్వాలియర్, ఒ.సి.ఎం, డిగ్‌జామ్, విమల్ మరియు ఇతర ప్రముఖ మిల్లుల వస్త్రాలను ఇంకా రెడీమేడ్ గార్మెంట్స్‌ను ఎంచుకోండి.
అత్యుత్తమ నాణ్యతకు చెందిన షర్టింగ్ లను ధరించి మురిసిపోండి.
నాణ్యతను అభిలషించేవారు "మన్‌హర్‌లో బ్రహ్మాండమైన వస్త్రశ్రేణి ఉన్నదని ఊహించే వచ్చాం" అనటంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

* వెడ్డింగ్ సూట్స్ ప్రత్యేక కౌంటర్ కలదు.

# మన్‌హర్ (A.C.)

బీసెంట్ రోడ్, విజయవాడ — 2.
Ph: 77801, 66172

# అభినందన

మాస్టారు ఆ రోజు హాఫియర్లీ పరీక్ష పేపర్లు ఇస్తున్నారు. పిల్లలంతా ఆసక్తిగా మార్కుల కోసం ఎదురుచూస్తున్నారు. మూడు సబ్జెక్టుల్లో మహేష్, మిగిలిన మూడు సబ్జెక్టుల్లో గోపీ ఫస్ట్ వచ్చారు. మాస్టారు వారిద్దరిని పిలిచి అభినందించారు.

"మీరు చదువు విషయంలో ఇలా పోటీ పడటం నాకు చాలా ఆనందంగా ఉంది. ఏ విషయంలోనైనా పోటీ ఉన్నప్పుడే రాణిస్తారు. మీరిద్దరూ ఇలాగే శ్రద్ధగా చదువుకోండి" అన్నారు మాస్టారు.

'అలాగే' అన్నారు మహేష్, గోపి. మూడు సబ్జెక్టుల్లో ఫస్ట్ వచ్చినందుకు గోపి మహేష్‌ను అభినందించాడు. మహేష్ మాత్రం ముఖం అదోలా పెట్టి వెళ్ళిపోయాడు.

వాళ్ళిద్దరు కేవలం చదువులోనే కాకుండా క్విజ్, వ్యాసరచన పోటీ, చదరంగం లాంటి అన్ని విషయాల్లోను పోటీపడతారు. మహేష్ తనకు రాని ఆటల్లో కూడా గోపీకి పోటీగా ఉండేవాడు. గోపీకి బహుమతి వస్తే సహించేవాడు కాదు.

వారం రోజుల తర్వాత జరిగే ఈతపోటీల్లో పాల్గొనేందుకు పేరు ఇచ్చాడు గోపి. గత రెండేళ్ళుగా గోపి ఈత పోటీల్లో ఫస్ట్ వస్తున్నాడు. మహేష్ కూడా తన పేరు ఇచ్చాడు. అది చూసి గోపి-

"మహేష్! నీకు ఈత రాదుకదా ఎలా ఈదుతావ్" అన్నాడు.

"ఏం పరవాలేదు. వారం రోజుల్లో ఈత నేర్చుకుని ఈదుతా. నేను పాల్గొంటే నీకు భయంగా ఉందా?" అన్నాడు మహేష్ ఎగతాళిచేస్తూ.

ఈతపోటీల రోజు రానే వచ్చింది. అందరూ ఒకరికొకరు 'విష్ యూ ఆల్ ది బెస్ట్' అని చెప్పుకున్నారు. మహేష్ మాత్రం గోపీకి చెప్పలేదు.

పోటీ ప్రారంభమయ్యింది. పిల్లలందరు గమ్యం వైపు ఈదుతూ వెళుతున్నారు. కొంత దూరం తనతో సమానంగా వచ్చిన మహేష్ వెనకబడటం గమనించాడు. గోపి తనను దాటి వెళ్ళడంతో మహేష్ ఉక్రోషంతో రొప్పుతూ ఈదబోయాడు . ఈలోగా దమ్ము పట్టడం కష్టమవడంతో నీళ్ళలో మునిగిపోయాడు.



ఒడ్డున ఉన్న వాళ్ళంతా 'మహేష్' అంటూ అరవసాగారు. ముందు వెళ్తున్న గోపీ వెనుకకు తిరిగి మహేష్ నీళ్ళలో మునిగి పోవడం చూసి తొందరగా మహేష్ దగ్గరికి వచ్చి అతడిని ఒడుపుగా పట్టుకుని ఒడ్డుకు చేర్చాడు. కాసేపు ప్రథమ చికిత్స చేసేసరికి మహేష్ మెల్లిగా తెప్పరిల్లాడు.

మహేష్ గోపీకి కనీసం 'థాంక్స్' అయినా చెప్పకుండా వెళ్ళిపోయాడు. ఆ మర్నాడు జిల్లా జడ్జి విజేతలకు బహుమతులు అందచేశాడు. సాహసంతో మహేష్‌ను రక్షించినందుకు గోపీకి ప్రత్యేక బహుమతిని ఇచ్చి మెచ్చుకున్నాడు.

గోపి ఆయనకు థాంక్స్ చెప్పి పక్కనే కూర్చున్న హెడ్మాష్టరుగారి దగ్గరకు వెళ్ళి "మాస్టారు నేను ఒకసారి మైకులో మాట్లాడవచ్చా" అన్నాడు, 'అలాగే' అన్నాడు హెడ్మాష్టరు.

గోపి మైక్ వద్దకువెళ్ళి 'మిత్రులారా! నేను చదువులో, ఆటల్లో శ్రద్ధ వహించడానికి మహేషే పరోక్ష ప్రేరణ. అటువంటి మహేష్ వారం రోజుల్లో ఈత నేర్చుకుని నాకు పోటీగా ఎంతో సాహసంగా ఈదాడు. అతని పట్టుదల చూసి, నా ఈ బహుమతిని మహేష్‌కు ఇవ్వాలనిపిస్తున్నది, అంటూ మహేష్‌ను స్టేజి పైకి పిలిచి బహుమతిని మహేష్‌కు అందించాడు.

గోపి మాటలకు మహేష్ మనసు కదిలిపోయింది. 'తను ఈర్ష్యతో గోపికి పోటీగా నిలబడితే గోపి దాన్ని మెచ్చుకుని తన బహుమతిని నాకు ఇస్తున్నాడు. దేనికైనా పోటీ పడాలి. కాని ఎదుటివాడిని కించపరచేలా ఉండకూడదు. అలాగే పోటీలో గెలిచినా, ఓడినా సరదాగా తీసుకోవాలి. ఒకవేళ ఓడితే తర్వాత గెలిచేందుకు పట్టుదలతో కృషి చేయాలి. అంతేగాని ఈర్ష్య పడొద్దు' అనుకుంటూ స్టేజిపైన ఆనందంతో గోపిని కౌగలించుకున్నాడు మహేష్.

**యస్.యస్. శర్మ**

## నవోదయ విద్యాలయాల్లో ప్రవేశానికి


జవహర్ నవోదయ విద్యాలయాల్లో ప్రతిభావంతులైన విద్యార్థులను ఆరవ తరగతిలో చేర్చుకుంటారు. ఇందులో విద్యాబోధన, భోజనం, బట్టలు, పుస్తకాలను కేంద్ర ప్రభుత్వం ఉచితంగా ఇస్తుంది. బాల బాలికలకు వేరు వేరు వసతి సౌకర్యం ఉంటుంది. నవోదయ విద్యాలయాల్లో చేరే విద్యార్థులకు అయిదవ తరగతి స్థాయిలో ప్రవేశ పరీక్ష ఉంటుంది.

పరీక్ష 1990 ఫిబ్రవరి పదవ తేదీన ఉంటుంది. రాష్ట్రంలో గుర్తింపు పొందిన ప్రభుత్వ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులందరూ పరీక్ష రాయవచ్చు. దరఖాస్తు ఫారాలు అక్టోబర్ పదవ తేది వరకు డి.ఇ.ఓ. ఇతర విద్యాశాఖాధికారులు, ఆయా జిల్లాలలోని నవోదయ పాఠశాల ప్రిన్సిపాల్ నుండి ఉచితంగా తీసుకోవచ్చు. దరఖాస్తు నమూన ఉంటే దాని ప్రకారం తెల్ల కాగితం మీద రాసి కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు ఫారాలను అక్టోబర్ 15వ తేది లోపల డి.ఇ.ఓ.కు గాని, మండల విద్యాశాఖాధికారికి (యం.ఇ.ఒ) గాని ఇచ్చి రసీదు తీసుకోవాలి.

రెండు గంటల ప్రవేశ పరీక్ష మూడు విభాగాలుగా ఉంటుంది. అన్నీ ఆబ్జెక్టివ్ ప్రశ్నలే ఉంటాయి. విద్యార్థి అయిదవ తరగతి ఏ భాషలో చదివితే ఈ పరీక్ష ఆ భాషలోనే ఉంటుంది. మేధాశక్తి, గణితం లలో పరీక్ష ఉంటుంది. ప్రతిభ ప్రకారం విద్యార్థులకు సీట్లు ఇస్తారు.

ఈ పరీక్ష రాయడానికి విద్యార్థులకు, కొద్దిగా శిక్షణ ఇస్తే చాలు. మాదిరి ప్రశ్నాపత్రాన్ని బట్టి అలాంటి ప్రశ్నలకు సమాధానం ఎలా ఇవ్వాలో అభ్యాసం చేస్తే సరిపోతుంది. పరీక్ష తేలికగానే ఉంటుంది. కావలసిందల్లా తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ప్రోత్సాహం. అలాగే విద్యార్థికి శ్రద్ధ ఉంటే సీటు తప్పక వస్తుంది.

# హార్న్‌బిల్



పొడవైన పెద్ద ముక్కు, దానిపై టోపీ లాంటి అమరిక, ముక్కును మించిన పొడవుతో తోక, నలుపు తెలుపు రంగుల పెద్ద ఈకలు, పెద్ద శబ్దంతో కూతవేస్తూ, చిత్ర విచిత్రమైన అలవాట్లతో, గమ్మత్తుగా అనిపించే హార్న్‌బిల్ అనే పక్షి అస్సాం అడవుల్లో కనిపిస్తుంది. ఇది గద్దకన్నా కొంచెం పెద్దది. ఇది 30 సెంటీమీటర్ల బలమైన ముక్కుతో కలిపి దాదాపు 5 అడుగుల

పొడవు ఉంటుంది. ముక్కు ముదురు పసుపు రంగులో దానిపై టోపీలాంటి అమరిక నలుపు పసుపు రంగుల్లో ఉంటుంది. తోక తెలుపు రంగులో ఉండి కింద అడ్డంగా చిన్నపట్టీ ఉంటుంది. పొట్ట భాగంలో ఈకలు తెలుపుగా ఉంటాయి. ఈ పక్షి దట్టమైన అడవుల్లోనే నివసించడానికి ఇష్టపడుతుంది. పెద్ద చెట్ల కున్న చిన్న తొర్రల్లో ఉంటుంది. చిన్న గింజ లున్న పండ్లు, పురుగులు, ఎలుకలు, బల్లులు, చిన్న పాములను ఇది ఇష్టంగా తింటుంది. ఇది ఎగురు తుంటే రెక్కల శబ్దం గమ్మత్తుగా వస్తుంది.

ఆడ మగ హార్న్‌బిల్ పక్షులు కలిసి ఒక చెట్టు తొర్రను ఇంటిగా చేసుకొంటాయి. అందులో ఆడపక్షి రెండు నుండి నాలుగు గుడ్లను పెడుతుంది. తర్వాత గుడ్లమీద పొదగడానికి కూర్చుంటుంది. అప్పుడు మగ పక్షి ముక్కును తాపీలా ఉపయోగించి రెట్ట, మట్టితో చెట్టు తొర్ర ద్వారాన్ని మూసి వేస్తుంది. దానికి ఒక చిన్న కన్నం మాత్రం ఉంచుతుంది. దీని నుంచి మగపక్షి ఆడపక్షికి ఆహారం అందిస్తుంది.

గుడ్లు పొదిగి పిల్లలు బయటికి వచ్చి రెండు నెలల వయస్సు వచ్చేవరకు ఆడపక్షి ఆ గూటిలోనే ఉంటుంది.

అంటే దాదాపు నాలుగు నెలలు ఆ గూటిలోనే ఎటూ కదలకుండా ఉంటుంది.

పిల్లలు ఎదిగి వాటంతట అవే ఆహారం సంపాదించుకునే స్థితికి రాగానే మగపక్షి గూటిని ముక్కుతో పగలగొడుతుంది.

అపుడు తల్లి, పిల్లలు బయటికి వచ్చి స్వేచ్ఛగా ఎగురుతాయి.



# కలంచెలిమి

**వి. శైలజ (14సం॥)**
హాబీలు : చదువు, చెస్ ఆడటం
ఇ.నెం. 68-10-20
విద్యుత్‌నగర్, కాకినాడ.

**కె.ఎస్.వి. రావ్ (15సం॥)**
హాబీలు : డిబేటింగ్, డ్రామా, పాటలు పాడటం, క్విజ్, పబ్లిక్ స్పీకింగ్
255 శాస్త్రీహౌజ్, బెంగుళూర్ మిల్ట్రీస్కూల్
రిచ్‌మండ్ టౌన్, బెంగుళూరు - 560 025.

**టి. అరవిందకుమార్ (15సం॥)**
హాబీలు : చదువు, జి.కె. క్రికెట్
S/o. టి. హన్మాండ్లు (టీచర్)
పోలీస్ స్టేషన్ ఎదురు వీధి
పో॥ గ్రా. కోటగిరి, నిజమాబాద్ జిల్లా.

**ప్రణయ కుమార్ (12సం॥)**
హాబీలు : ఆటలు, పుస్తకాలు చదవడం
S/o. రవీందర్‌రావు,
ఇంటి నెం. 9/20,
మరత్‌నగర్ కాలనీ, పటాన్ చెరువు.

**సి.హెచ్. సుజాత (12సం॥)**
హాబీలు : పాటలు పాడటం, క్యారమ్స్ ఆడటం, స్టాంపుల సేకరణ
D/o. సారయ్య
ఇ.నెం. 1888, రమేష్‌నగర్,
గోదావరి ఖని - 505 209.
కరీంనగర్ జిల్లా.

**సి.వి. ప్రశాంతి (12సం॥)**
హాబీలు : మేజిక్, చిత్రకళ, రచనలు చేయటం
D/o. సి.వి. రమణ
ఇ.నెం. 6-3-584/4
తాతానగర్, హైదరాబాద్ - 500 004.

**కలం చెలిమి శీర్షికలో ఆసక్తి ఉన్నవారు చిరునామా ఇతర వివరాలను పంపించవచ్చు.**

MANUFACTURERS AND DEALERS FOR :
SURVEY, DRAWING AND DESIGNING INSTRUMENTS
HYDROLOGICAL AND METEOROLOGICAL EQUIPMENTS
SCIENTIFIC AND LABORATORY EQUIPMENTS
INDUSTRIAL GAS CYLINDERS
KELTRON CALCULATORS, AUDIO-VISUAL EQUIPMENTS
AND SERVO STABILISERS
HAKIMS DISPLAY SYSTEMS AND AUDIO VISUAL AIDS

DETEK

DECCAN TEKNO CORPORATION


3-6-475/4, HIMAYATNAGAR, HYDERABAD - 500 029. PHONE : 66367

CELEBRATE DIWALI WITH
DELICIOUS AGRA AND BENGALI SWEETS FROM

manikonda

Jyothirmayee Complex, Opp. Venkatesha Theatre, Narayanguda, Hyderabad-29 Tel: 62371

హన్ని మగకోతి. పేరుకు తగ్గట్లుగా దీనివన్నీ కోతి బుద్ధులు. ఎప్పుడూ ఎదుటివారిని ఏడిపిస్తుంది. వాళ్ళు బాధపడుతుంటే తను సంతోషిస్తుంది. చిక్కి అనే ఆడకోతి ఎక్కడినుండో ఒక అరటిపండు సంపాదించుకొని తినబోతుంటే, దాన్ని లాక్కొని ఏడిపించాలని చూసింది. అప్పుడేమయిందంటే..... తర్వాత కథ బొమ్మలు చూస్తే మీకే తెలుస్తుంది.



# క్రమశిక్షణలో సృజనాత్మకత పుట్టదు

విద్యార్థుల క్రమశిక్షణ, నైతిక విలువలు, మన విద్యా విధానం-ఉపాధ్యాయుల పాత్రలపై రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ శ్రీ. యం. వెంకారెడ్డి ఇలా అంటున్నారు.



క్రమశిక్షణ పేరుతో పిల్లలను కట్టుదిట్టమైన వాతావరణంలో పెంచితే వారిలో సృజనాత్మకత వృద్ధి చెందదు. అభివృద్ధి చెందిన దేశాల్లో పిల్లలను స్వేచ్ఛా వాతావరణంలో వారికిష్టమైన విషయాలను నేర్చుకోనిస్తారు. ఇది శాస్త్రీయ పద్ధతి కూడా. చదువుతో పాటు విద్యార్థుల్లో నైతిక విలువలు జాతీయుతా భావాలు ఉండాలి. ఈ విషయంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేస్తూనే ఉన్నారు. కాని ఇవి పాఠశాలలో ఉపాధ్యాయులు మాత్రమే చెప్పే విషయాలు కావు. సాంఘిక, రాజకీయ పరిస్థితులు కూడా విద్యార్థుల్లో నైతిక విలువలు ఏర్పరుస్తాయి.

***

సామాజిక పరివర్తనకు అక్షరాస్యత అవసరం. అక్షరాస్యత అభివృద్ధి చెందకుండా ఏ జాతి పురోగమించదు. ఉపాధ్యాయుల చిత్తశుద్ధే విద్యారంగాన్ని అభివృద్ధి పరుస్తుంది. వారి దృక్పథంలో మార్పు రావాలి. సమాజం మారుతూ తనదైన నూతన విలువలను నిర్ణయించు కుంటుంది. దానికి అనుగుణంగా విద్యారంగంలో, ఉపాధ్యాయుల్లో మౌళికమైన మార్పులు రావాలి. గత 45 ఏళ్ళలో ఈ మార్పులు రాలేదు.

పలు దేశాల్లో విద్యారంగం తీరును పరిశీలించాను. ఈనాడు ప్రపంచ దేశాలన్నీ ప్రాథమిక, సాంకేతిక విద్యలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయి. వారి బోధనాస్థాయి మెరుగ్గా ఉంది. మన ఉపాధ్యాయులు బాధ్యతలను ఛాలెంజ్‌గా తీసుకుని తరగతి గదికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి.

# దేశమంటే మట్టికాదోయ్
# దేశమంటే మనుషులోయ్

విద్యాలయాలు చెరసాలలు కాదు
విద్యార్థులు యంత్రాలు కాదు–మానవులు.
విద్యార్థులలో గల ప్రతిభను గుర్తించి పదును బెట్టడం అంతతేలికకాదు.
34 ఏండ్లనుండి లక్షకుపైగా విద్యార్థులను తీర్చిదిద్దిన సంస్థ.
ఎంట్రన్స్ పరీక్షకు రాష్ట్రంలోప్రథమంగా శిక్షణ ప్రారంభించి
వేలాదిగా దేశవిదేశాలలో రాణిస్తున్న డాక్టర్లు, ఇంజినీర్లను
తయారుచేసిన సంస్థ.
విద్యారంగాన్నే పూర్తిగా మార్చి చరిత్ర సృష్టించిన సంస్థ.
ఎన్నో ఘనవిజయాలకు మారుపేరు.
ఎంతోమందికి అనుకరణీయమైనది.

## రవి కళాశాల బ్రాడీపేట, గుంటూరు–2

7వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఇంగ్లీషు, తెలుగు
మీడియంలలో శిక్షణ.

## రవి రెసిడెన్షియల్ కాలేజి

ఇంటర్ *M.P., Bi.P.* గ్రూపులలో ఇంగ్లీషు, తెలుగు
మీడియంలలో శిక్షణ.
120 మందికి మాత్రమే ప్రవేశము. (బాలురకు మాత్రమే)
ప్రవేశపరీక్ష పదవతరగతి ఫలితాలు వెలువడిన మూడవరోజు.
అధ్యాపకులందరూ అనుభవజ్ఞులు–మాపద్ధతిలో ఆరితేరినవారు.

## EAMCET కు రవిలాంగ్‌టర్మ్‌కోచింగ్


**ప్రాస్పెక్టస్‌కు రూ 10/– పంపండి.**

డైరెక్టర్: **సి.వి.ఎన్.ధన్** *M.A.,* (సైకాలజీ)
ప్రిన్సిపాల్: **సి. ఝాన్సిలక్ష్మీబాయ్** *M.A., M.Ed.*

### బోసినవ్వుల తాత గాంధీజీ

అక్టోబర్-2వ తేది అనగానే చప్పున జాతిపిత మహాత్మ గాంధీజీ పేరు గుర్తుకు వస్తుంది. ఈ రోజు గాంధీజీ పుట్టిన రోజు. సత్యం, అహింస, క్రమశిక్షణ, అణగారిన ప్రజలపట్ల ప్రేమలు ఆయనను మహాత్ముని చేశాయి. ఏ హింసనయితే వద్దని ప్రభోదించాడో ఆ హింసకే ఆయన బలయ్యాడు. 1948 జనవరి 30వ తేదీన 'నాథూరామ్ గాడ్సే' పేల్చిన రివాల్వర్ గుండ్లకు బలయ్యాడు.

అక్టోబర్ 2వ తేదీనే మరో జాతీయ నాయకుడి పుట్టిన రోజు ఆయన ఎవరంటే శ్రీ లాల్‌బహదూర్ శాస్త్రి.







## పుస్తక పరిచయం

### కాలెండర్‌తో అంకెల సరదా

రచయిత : పి.కె. శ్రీనివాసన్
పేజీలు : 88
వెల : 10/-
ప్రచురణ : బాలసాహితి
2-1-1/5, నల్లకుంట,
హైదరాబాదు.

కాలెండరులో తేదీల అమరిక క్రమ పద్ధతిలో ఉంటుంది. ఈ పద్ధతిని, అద్భుత విషయాన్ని పిల్లలను ఆకట్టుకొనే రీతిలో రచయిత పి.కె. శ్రీనివాసన్ ఈ పుస్తకంలో రాశారు. కూడికలు, తీసివేతలు, గుణకారాలు తెలిసినవారు క్యాలెండర్ అంకెలతో లెక్కలు, గమ్మత్తుగా చేస్తూ గణితాన్ని సరదా కోసం ఎలా వినియోగించుకోవచ్చో ఈ పుస్తకంలో ఉంది. 11నుండి 14 సంవత్సరాల వయస్సున్న పిల్లలు చదువుకోవడానికి అనువైన పుస్తకం ఇది. పిల్లలకు గణితం పట్ల ఆసక్తి, సిద్ధాంతాలను అవగాహన చేసుకోవడానికి ఈ పుస్తకం ఉపయుక్తంగా ఉంటుంది.

### బాలల విజ్ఞాన సర్వస్వం

**సంస్కృతి విభాగం**

సంపాదకుడు : బుడ్డిగ సుబ్బరాయన్
పేజీలు : 360; వెల : 150/-
ప్రచురణ : అభినందన పబ్లిషర్స్,
28-10-1, కారల్‌మార్క్స్ రోడ్డు,
విజయవాడ - 520 002.

పిల్లలకై తెలుగులో విజ్ఞాన సర్వస్వం తయారు చేయాలని ప్రయత్నాలు గతంలో ఎందరో చేశారు. చివరికి శ్రీ బుడ్డిగ సుబ్బరాయన్ చొరవ వల్ల అది ఈ మధ్యే వెలువడింది. సంస్కృతి విభాగంపై ఇప్పుడు వెలువడింది విజ్ఞానసర్వస్వం లోని మొదటి భాగం మాత్రమే.

ప్రపంచంలో వెలసిన నాగరికతలు, సాంస్కృతిక శీర్షికలు, ఉద్యమాలు, విప్లవాలు తాలూకు వెయ్యి ఆకారాది శీర్షికల్లో మధ్య మధ్య బొమ్మలతో చక్కగా వివరించారు. దీన్ని పిల్లలకు పనికివచ్చే కరదీపికలా తీర్చి దిద్దారు.

# పాపాయి చదువు



పాప బడిలో చేరింది
పలకా బలపం పట్టింది
'అ ఆ' లన్నీ నేర్చింది
'కఖా'లన్నీ దిద్దింది

మాటలు బాగా రాలేదు
ముక్కున కోపం పోలేదు
'పలకాబలపం' అనవే అంటే
'బలకం కలపా' అంటుంది

'రఘుపతిరామా' అని చెబితే
'లఘుపతి లామా' అంటుంది
గణపతి ముక్కుకు పేరేమంటే
టొండము టొండము అంటుంది.

బడిలో పిల్లలు విన్నారు
పక్కున అందరు నవ్వారు
పాపకు రోషం హెచ్చింది
కోపం ముంచుకు వచ్చింది.

గాలి ప్రభావతి



# అయిదువేళ్ళు

చిన్నది చిన్నది చిటికెన వేలు
ఉన్నది పక్కనె ఉంగరం వేలు
నడుమన పొడవుది నడిమీ వేలు
చూపును దిశలను చూపుడు వేలు
పొట్టిది గట్టిది బొటనా వేలు

అన్నము కలుపును అయిదూ వేళ్ళు
ఆకలి తీర్చును అయిదూ వేళ్ళు
ఐక్యత నేర్పును అయిదూ వేళ్ళు
అమ్మలవంటివి అయిదూ వేళ్ళు
అమ్మలకమ్మలు అయిదూ వేళ్ళు

పి.ఎల్. శ్రీనివాసరెడ్డి

## చెలిమి క్లబ్

**హలో! నాపేరు పొన్ను, నేనీ క్లబ్‌కు అధ్యక్షుడిని.....**

**మీరు క్లబ్ సభ్యత్వం తీసుకుంటే బోలెడన్ని లాభాలు.....**

1. చెలిమి ఏడాది చందాలో ప్రత్యేక తగ్గింపు.
2. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ ఎకాడమీ ప్రచురించే పుస్తకాలపై ప్రత్యేక తగ్గింపు.
3. మీ ప్రతీ పుట్టిన రోజుకు అభినందనలతో అందమైన గ్రీటింగ్ కార్డ్ అందుకుంటారు.
4. మీలో ఉన్న టాలెంట్‌ను అభివృద్ధి చేసుకోవడానికి క్లబ్ నిర్మాణాత్మక సహకారం అందిస్తుంది.
5. మీ స్కూల్లో, ఊర్లో పిల్లల కార్యక్రమాల వార్తలను చెలిమి సమాచారపత్రికకు పంపడానికి మీరు విలేఖరిగా ఉండవచ్చు.
6. అందమైన మెంబర్ షిప్ బ్యాడ్జ్ అందుతుంది.
7. మిమ్మల్ని ఆశ్చర్యపరచే బహుమతులు అందుతాయి.
8. రాష్ట్రం నలుమూలలా కలం స్నేహితులను సంపాదించుకోవచ్చు.

ఇలా ఎన్నో లాభాలు.

**సభ్యత్వం పొందడం చాలా సులభం**

పదిహేను సంవత్సరాల
లోపు పిల్లలకే సభ్యత్వం
బాలచెలిమికి ఏడాది చందా కట్టి లేదా
కట్టించి రిసీట్ నంబర్ వివరిస్తూ కూపన్
నింపి పంపండి చాలు..
తర్వాత ఎన్నో లాభాలు......

**'చెలిమి' క్లబ్ కూపన్**

చెలిమికి చందాకట్టాను / కట్టించాను. చెలిమిక్లబ్‌లో నన్ను సభ్యుడిగా చేర్చుకొంటారని ఆశిస్తున్నాను.

M.O., D.D., P.O. రసీదు నం. ____________________

పేరు ____________________

స్కూలు ____________________

తరగతి ______________ పుట్టినతేది ______________

చిరునామా ____________________

____________________

____________________

పిన్ ____________________

సంతకం

శుభాకాంక్షలతో

**SRIDURGA ESTATES**

G1. Bhasker Apartments, Raj Bhavan Road.
Somajiguda, Hyderabad-500 482 Phone : 212474

# Holy Faith International Pvt. Ltd.

( A MBD Group of Publications)
NEW DELHI.

Publishers of Colourful Children's Text Books
Intelligently Planned, Beautifully designed and well presented.

Our Sister Concerns

| | |
|---|---|
| **HOLY FAITH INTERNATIONAL** for Colourful Children's Text-Books | **MBD BOOKS** for Schools, Colleges and Competitions |
| **BOOKMINE** for Low-Priced Quality Children's Books | **MODERN PUBLISHERS** for Standard Text-books |

Head Office : New Delhi

Branches all over India.

Branch Office : Holy Faith International (P) Ltd.
3-4-829/A, Ist Floor, Barkatpura Chaman,
HYDERABAD - 500 027. PHONE : 64788

# నేనూ నా బాల్యం

**"చిన్నప్పుడు నేను పుట్టిన ప్రదేశం, ఆ పరిసరాలే నన్ను నాట్యకళవైపు మళ్ళించాయి." అంటున్న శ్రీ నటరాజ రామకృష్ణ చిన్ననాటి కబుర్లు విందామా!**

భారతదేశానికి వేలాది కిలోమీటర్ల దూరంలో ఉన్న బాలిదీవుల్లో 1933లో పుట్టాను. బౌద్ధం, హిందూ పద్ధతులు, సంప్రదాయాలు మన నృత్య రీతులు సజీవంగా ఉన్నాయక్కడ. పండుగలు, ఉత్సవాలప్పుడు అక్కడ దేవాలయాల్లో నృత్య కార్యక్రమాలు జరుగుతాయి. అజంతా, ఎల్లోరాల్లోని సుందర స్త్రీలు జీవం పోసుకొని నృత్యం చేస్తున్నారా అనే భ్రమ కలుగుతుంది. వారి వేషం, అలంకరణ కూడా అలాగే ఉంటుంది.

ఎటు చూసినా పచ్చదనం, మనుష్యుల మధ్య స్నేహభావం, అంతా ఉత్సాహంగా ఉంటుంది. ఆ పరిసరాలు, ఆ వాతావరణమే నాలో నాట్యం పట్ల ఉత్సాహాన్ని కలిగించాయి.

నా అయిదేళ్ళప్పుడు బాలి ద్వీపం నుండి గుంటూరు జిల్లాలోని చిన్న పల్లెటూరుకు వచ్చాము. అయినా అక్కడి పరిసరాలు ఆ జ్ఞాపకాలు నాలో ఈ రోజుకు నూతనంగానే ఉన్నాయి. ఏదో పండగ రోజు ఊరి గుడిలో నృత్యకార్యక్రమం జరిగింది. ఆ నృత్యం నన్ను పూర్తిగా నాట్యరంగం వైపు ఆకర్షింప జేసింది.

గుడి ప్రక్కనే ఉన్న తుమ్మచెట్టు దాని ఎండిన కాయలను ఊపితే లోపల గింజ కదులుతూ శబ్దం చేసేది. తుమ్మకాయలను విరిచి మూడు మూడుగా దారంతో వరుసగా కట్టి, వాటిని గజ్జెలుగా కాళ్ళకు కట్టుకుని నృత్య సాధన ఆరంభించాను. నేను ఏ గురువు దగ్గర నాట్యం నేర్చుకోలేదు.

దేవాలయాల్లో గోడలపై ఉన్న శిల్పాలు, నాట్యశాస్త్ర పుస్తకాలు నాకు గురువులు.



యాభై ఏళ్ళక్రితం తెలుగు దేశంలో నాట్యాన్ని చులకనగా చూసేవారు. అందుకే మానాన్న నన్ను నాట్యం నేర్చుకోవద్దని అన్నారు. నాట్యమే కావాలంటే ఇల్లువిడిచి పొమ్మన్నారు. అందుకే ఇల్లు విడిచిపెట్టాను.

లక్షల ఆస్తిని వద్దనుకున్నాను. దరిద్రం అనుభవించాను. కాని పట్టుదలతో నాట్యం నేర్చుకున్నాను. దానినే అధ్యయనం చేశాను.

ఆ నాట్యమే నాకు పేరును, డబ్బును సంపాదించి పెట్టింది. ఇప్పుడు నాశిష్యులు, శిష్యుల శిష్యులు వేలాదిమంది ప్రపంచ మంతటా ఉన్నారు. మనం మరచిపోయిన "ఆంధ్రనాట్యానికి" ప్రచారం చేయగలిగాను. "పేరిణి శివతాండవం" రీతిని కూర్చాను. నాట్యశాస్త్రంపై ఎన్నో గ్రంథాలు రాశాను. నేను చేసిన దానికి నాకు సంతృప్తి ఉంది.

**కూపన్ :**

దయచేసి ఈ కూపన్ నింపి పంపండి. 'చెలిమి'ని మరింత అర్థవంతంగా తీర్చి దిద్దేందుకు సహకరించండి.

1. సాధారణ అభిప్రాయం.

బాగుంది ☐

పరవాలేదు ☐

బాగాలేదు ☐

2. మీకు నచ్చిన శీర్షికలు

____________

____________

____________

____________

3. మీకు నచ్చని శీర్షికలు

____________

____________

____________

4. మీ సూచనలు

____________

____________

____________

ఈ స్థలం సరిపోకుంటే తెల్లకాగితంపై రాయండి.

చిరునామా

____________

____________

____________

____________

సంతకం

**మొదట అందిన 50 కూపన్‌లకు చక్కని బహుమతి ఉంటుంది.**

# చెలిమి లేఖలు

భావిపౌరులైన బాలల్లో సృజనాత్మక శక్తి, ఆలోచనా ధోరణి, సమాజ స్పృహ కలిగించడంలో 'బాలచెలిమి' ఉపయోగపడాలనే మీ ప్రయత్నం జయప్రదం కావాలని

**శుభాకాంక్షలతో**

**వావిలాల గోపాలకృష్ణయ్య**

**సత్తెనపల్లి, గుంటూరు జిల్లా.**

మీ ఆశలు, ఆశయాలు నాకు నచ్చాయి. ఈ పత్రిక ప్రచురణ కృషిలో మీరు కృతకృత్యులుకాగలరని ఆశిస్తున్నాను.

**బాలబంధు, బి.వి. నరసింహారావు**

**గుడివాడ**

మీ ప్రయత్నాలు సరియైన పద్ధతిలో జరిగాయి. మీ పత్రిక ఖచ్చితంగా విజయవంతం అవుతుంది. గుడ్‌లక్.

**ఇందిరా కులశ్రేష్ట**

**రిసర్చ్ ఆఫీసర్, ఎన్.సి.ఇ.ఆర్.టి**

**న్యూఢిల్లీ.**

చిరునవ్వులు చిందించే పిల్లలకోసం చిరుదివ్వెలు వెలిగించాలనే మీ ప్రయత్నంలో సహృదయంతో పాలువంచుకోగలను. శుభాభినందనలతో....

**వారాల ఆనంద్**

**కరీంనగర్.**

కామిక్స్, రంగుల బొమ్మలు పిల్లల్ని ఇంప్రెస్ చేస్తాయి. ఇప్పుడు తెలుగులో వస్తున్న దాదాపు అన్ని పత్రికలు చాలా వరకు అనవసర విషయాల్ని ప్రచురిస్తున్నాయి. ఏదైనా సైంటిఫిక్ ఫిక్షన్ అవసరం కొంత ఉంది. దయ్యాలు, దేవతల కథలు అవసరం లేదు.

**ఎ.బి.కె. ప్రసాద్,**

**ఆంధ్రభూమి దినపత్రిక**

**సంపాదకులు, హైదరాబాద్.**

## ధన్యవాదాలు

పిల్లల్లో సృజనాత్మకతను పెంచి వారు అన్ని విధాలా అభివృద్ధి చెందే రీతిలో విద్యను అందించాలనే లక్ష్యంతో దశాబ్దం క్రితం ఏర్పడిన సంస్థ "చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ ఎకాడమీ". తల్లిదండ్రులు, మేధావులు, ఉపాధ్యాయులు, సంఘసేవకులు కూడా మా ఈ మహాకార్యంలో పాలుపంచుకునేలా వర్క్‌షాప్స్, సేమినార్లను చిల్డ్రన్స్ ఎకాడమీ నిర్వహిస్తున్నది. పుస్తకాలు, వీడియోచిత్రాలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ఆధునిక విజ్ఞానాన్ని పిల్లల్లో విస్తరింపచేయడానికి ఎకాడమీ కృషి చేస్తున్నది. ఆకృషిలో భాగమే ఈ "బాలచెలిమి". మా ఈ ప్రయత్నంలో సహకరించిన శ్రీ యమ్.యన్. ప్రాణ్‌రావు, శ్రీ కుమారస్వామి, డా|| జయధీరు తిరుమలరావు, శ్రీ చొక్కాపు వెంకటరమణ, శ్రీ పి. లక్ష్మిరామిరెడ్డి, శ్రీ కే. సుందర్‌రామ్, శ్రీ విశ్వనాథరెడ్డి, డా|| దేవరాజు మహారాజు, శ్రీ పి. రామ్‌గోపాల్ రావు, శ్రీ ఎ. శరత్‌బాబు, శ్రీ ఎ. మనోహర్‌రావు, "బాలసాహితి" వారికి మా కృతజ్ఞతలు.

బాలచెలిమి పరిచయ సంచికను ఆవిష్కరించి ప్రోత్సాహించిన కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి శ్రీ ఉపేంద్ర గారికి మా ప్రత్యేక ధన్యవాదాలు.

చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ ఎకాడమీ,
హైదరాబాదు.



Edited & Published by Vedakumar. M on behalf of Children's Educational Academy, 10 Himayatnagar, Hyderabad - 500 029, Tel - 65669, Grams: CHELMI, Processed at OM SAI GRAPHICS, Printed at GAYATRI ENTERPRISES, Hyd.



ప్రకృతి
అందాలు..
చిందించే
సరిత చీరలు

SARITA®
FABRICS
BOMBAY-1
SAREES, DRESS MATERIALS, PUNJABI SUITS,
100% POLYESTER DHOTIS.

FILMSTAR BHANUPRIYA
IN SARITA FABRICS

RNI 25225/89-SB/333/88

REGD. NO. H/HD/723




Edited, Published by Vedakumar, M. on behalf of Children's Educational Academy, 10, Himayatnagar, Hyderabad-500 029 (A.P.) INDIA